గురువారం
06-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 45
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మెక్సికో అధ్యక్షురాలికి వేధింపులు

మెక్సికో సిటీ:
మెక్సికో దేశాధ్యక్షురాలే నడిరోడ్డుపై లైంగిక వేధింపులు కలకలం సృష్టించింది. ఓ కార్యక్రమానికి హాజరైన క్లాడియా షీన్‌బామ్ అక్కడ ప్రజలతో మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆమెపై చేయి వేస్తూ, ముద్దు పెట్టుకోబోయాడు.
భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. దీంతో దేశాధ్యక్షురాలికే రక్షణ లేకుండా పోయిందంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దుస్సాహసం చేసిన వ్యక్తి భీ కొడుతున్నారు.



నేడు అమరావతికి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి మూడు రోజుల లండన్ పర్యటన ముగిసింది. ఈ నెల 4న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ డిస్టింగ్విస్ట్ ఫెలోషిప్-2025 అవార్డుతో పాటు హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకున్నారు. ఇందుకోసం వ్యక్తిగత పర్యటనపై సీఎం తన సతీమణితో కలిసి

- మిగతా 2 లో

ట్రంప్ పాలనకు ఛీత్కారం

- న్యూయార్క్ మేయర్‌గా సోషలిస్టు జొహ్రాన్ మమ్దానీ
- స్థానిక పోరులో డెమొక్రాట్ల ప్రభంజనం
- వర్జీనియాలో భారత సంతతి ముస్లిం ఎన్నిక
- న్యూజెర్సీ, కాలిఫోర్నియా, సిన్సినాటిలోనూ రిపబ్లికన్లు చిత్తు



న్యూయార్క్:
ట్రంప్ సర్కారుకు స్థానిక ఎన్నికల్లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో రిపబ్లికన్లు ఘోర పరాభవాన్ని చవిచూశారు. 2024 ఎన్నికలప్పుడు ట్రంప్ హవాలో కొట్టుకుపోయిన డెమొక్రాట్ పార్టీకి ఈ ఎన్నికలతో కొత్త ఊపిరి లభించింది. ఆ పార్టీ అభ్యర్థులు ఘన విజయాలతో చరిత్ర సృష్టించారు. ప్రత్యేకించి భారత సంతతి దక్షిణాసియా మూలాలుగల ముస్లింల ఎన్నిక విశేషంగా నిలిచింది. నవంబరు 4న జరిగిన ఎన్నికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. వర్జీనియా నుంచి కాలిఫోర్నియా వరకు ప్రచారం చేశారు. ఒకప్పుడు రిపబ్లికన్లకు అనుకూలమైన ఈ ప్రాంతాల్లో డెమొక్రాట్లు పాగా వేశారు. రిపబ్లికన్లు చిత్తు అయ్యారు. మేయర్, గవర్నర్ల ఎన్నికలో రిపబ్లికన్లకు

- మిగతా 2 లో

ఒక్కటైన 10 వామపక్షాలు

- నేపాల్‌లో ఏకీకృత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం
- సమన్వయకర్తలుగా ప్రచండ, నేపాల్ ఏకగ్రీవం

ఖాట్మండు:
నేపాల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. 10 వామపక్ష పార్టీలన్నీ ఒక్కటయ్యాయి. సీపీఎన్ (మావోయిస్టు సెంటర్), సీపీఎన్ (ఏకీకృత సోషలిస్టు), నేపాల్ సోషలిస్ట్ పార్టీ, సీపీఎన్ (సోషలిస్ట్), జన సమాజ్‌వాదీ పార్టీ, నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్-సోషలిస్ట్), సీపీఎన్ (సమాజ్‌వాదీ)తో పాటు వామపక్ష పార్టీలన్నీ కలిసి ఐక్య పార్టీ ఏర్పాటునకు అంగీకారం తెలిపాయి. దీనికి సంబంధించి 18 అంశాల ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీంతో నేపాలీ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. ఏకీకృత పార్టీ సమన్వయకర్తలుగా పుష్ప కమల్ దహల్ (ప్రచండ), మాధవ్ కుమార్ నేపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజధాని ఖాట్మండులోని భ్రికుతి మండప్‌లో

- మిగతా 2 లో

గ్రూప్-1 మెయిన్స్‌పై విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో అవకతవకలు జరిగాయన్న పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. సర్కారు తరఫున న్యాయవాదులు మాట్లాడుతూ డిజిటల్, మాన్యువల్ విధానాల్లో మూల్యాంకనానికి సంబంధించిన ఆన్సర్ షీట్లు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని కోర్టుకు తెలిపారు.
అంతేకాకుండా డిజిటల్ వాల్యూయేషన్‌కు సంబంధించిన ఆన్సర్ షీట్లు స్కాన్ చేసిన డిస్క్

- మిగతా 2 లో

కాంగ్రెస్ అంటేనే కరెంట్

- 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు
- తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు
- పరిగిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- రూ.వెయ్యి కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-హైదరాబాద్:
కాంగ్రెస్ అంటేనే కరెంటు అని, కరెంటు అంటేనే కాంగ్రెస్ అని... కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదన్న వారు కరెంటుతో పాటు కాంగ్రెస్‌ను ముట్టుకుంటే తెలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. బుధవారం పరిగి నియోజకవర్గం లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు 53 లక్షల కుటుంబాలకు అందజేస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లాలో 2 లక్షల 47 వేల 777 కుటుంబాలకు గాను నిరుపేదలైన 1,43,190 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు . ఒక్క పరికి నియోజకవర్గంలోనే 44,500 కుటుంబాలకు గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లాలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తును నిరుపేదలకు ఇస్తున్నామని... దీనికి సంబంధించి 42 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ శాఖకు చెల్లిస్తుందన్నారు. ఈ విధంగా ప్రతి నెల గృహ జ్యోతి పథకం కోసం రాష్ట్ర నిరుపేద ప్రజల కోసం 2830 కోట్లను రాష్ట్ర

- మిగతా 2 లో

మహిళా సాధికారతతోనే ప్రగతి

అంతర్జాతీయ వేదికపై ఆకట్టుకున్న సీతక్క ప్రసంగం

విశాలాంధ్ర-హైదరాబాద్:
'ప్రతికూలతల నుంచి సాధికారత వైపు... దేశాలను మారుస్తున్న మహిళల శక్తి' అనే అంశంపై అంతర్జాతీయ వేదిక నుంచి మంత్రి సీతక్క చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. ఆదివాసీ బాలిక స్థాయి నుంచి రాష్ట్ర మంత్రి వరకు సాగిన తన జీవిత అనుభవాలను ఆమె పంచుకున్నారు. సమాజానికి అందించిన సేవలు, ప్రజాస్వామ్య పోరాటాలు, కరోనా కాలంలో చేసిన సహాయం గురించి వివరించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు. '16 ఏళ్లకు న్యాయం కోసం అడవుల్లోకి వెళ్లి తుపాకీ పట్టాను కానీ నిజమైన మార్పు విద్య, సాధికారతతో సాధ్యమని తెలుసుకున్నా' అని సీతక్క తెలిపారు. జనజీవన స్రవంతిలోకి వచ్చాక ఎంఏ., ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఉస్మానియా యూనివర్సిటీ నుండీ పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళల భాగస్వామ్యం 40 శాతం కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 20 శాతం లోపే ఉందని మంత్రి తెలిపారు. స్థూల జాతియోత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం పెంచేలా తెలంగాణ కృషి చేస్తుందన్నారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే సంకల్పంతో ఏటా రూ.25 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు మహిళా సంఘాలకు అందిస్తున్నట్లు వెల్లడించారు. 63 లక్షల మంది మహిళల సంఘటిత శక్తిగా 'ఇందిరా మహిళా శక్తి' పనిచేస్తోందన్నారు. ఆరోగ్యలక్ష్మి, బాలామృతం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లక్షలాది మంది తల్లులు, పిల్లలకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. అడవుల్లోని మారుమూల గ్రామాల్లో కూడా డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు సీతక్క తెలిపారు. సవాళ్లు అధిగమిస్తూ ములుగు అడవుల్లో కంటెయినర్లలో బడులు, వైద్య కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహిళ అభివృద్ధితో సామాజికాభివృద్ధి సాధ్యమన్నారు. మహిళల సాధికారతతోనే దేశం పురోగతి సాధించగలదని చెప్పారు. ప్రపంచానికి మహిళల శక్తిని చూపే సమయం ఆసన్నమైనదంటూ తన ప్రసంగాన్ని మంత్రి సీతక్క ముగించారు. చిత్తశుద్ధి, నిబద్ధత, పట్టుదలకి కృషిని జోడిస్తే అనుకున్న లక్ష్యం సాధించగలమని, ఇందుకు సీతక్క జీవితమే మంచి ఉదాహరణ అని కొందరన్నారు. సదస్సులో పెరూ ప్రధాని బెట్రిజ్ మెరినో, వివిధ దేశాల మహిళా ఎంపీలు, ప్రముఖులు ప్రసంగించారు. ఆయా దేశాల పరిస్థితులు, మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాధించాల్సిన లక్ష్యాలపై అనుభవాలు పంచుకున్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం

జూబ్లీహిల్స్ ప్రచారంలో మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్:
ఎన్నికల ప్రతి హామీని కచ్చితంగా నెరవేరుస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వాగ్దానం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి... అత్యధిక మెజారిటీతో నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఆయన బుధవారం ఎల్లారెడ్డి గూడ, కమలాపురి కాలనీ, ఇమాంగూడ, జయప్రకాశ్ నగర్, తవాక్కల్ నగర్, అలీ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురి కావొద్దని ప్రజలకు సూచించారు.
తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసిన నేతలు మొసలి కన్నీరు కారుస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్నారని విమర్శించారు. మా అభివృద్ధి, సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంటే, అది చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని శ్రీధర్ బాబు అన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాతో ముందుకెళుతున్నట్లు మంత్రి తెలిపారు. తమను ఆదరించాలని కోరారు.

సుంకాలపై ట్రంప్ 'ప్లాన్-బీ'

వాషింగ్టన్:
సుంకాల విషయంలో ప్రత్యామ్నాయాలు సిద్ధం చేసుకున్నట్లు ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టు విచారణ నేపథ్యంలో శ్వేతసౌధం మీడియా ప్రతినిధి కోలిన్ లీవిట్ 'ప్లాన్-బీ' సిద్ధంగా ఉందని చెప్పారు. ఎటువంటి పరిస్థితికైనా సిద్ధమన్నారు. సుప్రీం తీర్పు అనుకూలంగా వస్తుందన్నారు. ఈ కేసు భవిష్యత్తు పాలకులకు సుంకాలపై అత్యవసర అధికారాలకు సంబంధించినది అని ఆమె అన్నారు. ఆర్థిక భద్రత, జాతీయ భద్రత వేర్వేరు కాదని ట్రంప్ భావిస్తారన్నారు. ఈ కేసు దేశానికి జీవన్మరణం లాంటిదని ట్రంప్ అభివర్ణించారు. ఇదిలాఉంటే ట్రంప్ టారిఫ్‌ల భారంతో ఖర్చులు పెరిగాయని ఓ సర్వేలో అమెరికన్లు అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఇదీ లోకం!

బీజేపీ ఓట్ల చోరీకి ఈసీ సహకారం

- మా చేతిలో ఉన్న హెచ్-ఫైల్సే ఇందుకు సాక్ష్యం
- హర్యానాలో ఓట్లచోరీ జరగకుంటే కాంగ్రెస్ గెలిచేది
- ఎన్నికల అధికారులే మోదీతో పొత్తు పెట్టుకున్నారు
- సంచలన విషయాలు వెల్లడించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

న్యూఢిల్లీ:
కొన్ని గంటల్లో బీహార్ అసెంబ్లీ తొలి విడత జరగనున్న నేపథ్యంలో ఓట్ల చోరీ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీ మరోమారు సంచలన విషయాలు బయట పెట్టారు. ఓట్ల చోరీకి ఎన్నికలసంఘం బీజేపీకి సహకరిస్తోందని ధ్వజమెత్తారు. గత ఏడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరగకుంటే తమ పార్టీ విజయం సాధించేదని స్పష్టం చేశారు. ఆ ఎన్నికల్లో నకిలీ, డూప్లికేట్, బల్క్ ఓటింగ్ జరగబట్టే బీజేపీ గెలిచిందని ఆరోపించారు. బుధవారం దిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో

- మిగతా 2 లో

అధ్వాన పాలనను అడ్డుకోకపోతే అధోగతే

ఎన్‌డీఏ విధానాలపై రామకృష్ణ, వెంకటరెడ్డి

- ప్రైవేటీకరణ, అప్పులు, అవినీతితో అరాచకం
- తీవ్ర పేదరిక నిర్మూలనలో కేరళ విధానం స్ఫూర్తిదాయకం
- బీహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏకు పరాభవం తప్పదు
- డిసెంబరు 26న 'చలో ఖమ్మం'

విశాలాంధ్ర-విజయవాడ:
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అరాచక పాలనతో ప్రజల జీవన పరిస్థితులు దయనీయంగా మారిపోయాయని, బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారా ఈ అధ్వాన పాలనకు చరమగీతం పలకాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశాలు విజయవాడలోని దాసరి భవన్‌లో బుధవారం జరిగాయి. పి.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రామకృష్ణ, వెంకటరెడ్డి హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అజెండా ప్రవేశపెట్టారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ సీపీఐ చండీగఢ్ మహాసభలు ఇచ్చిన పిలుపుమేరకు వామపక్షాల ఐక్యత దిశగా పార్టీశ్రేణులను నడిపించాలని పిలుపునిచ్చారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా బలోపేతం కావడానికి సమస్యల ప్రాతిపదికగా ఉద్యమ నిర్మాణాలే శరణ్యమని అన్నారు. సరైన సమయంలో, సరైన రీతిలో, సరైన రాజకీయ నిర్ణయాలు అత్యంత అవశ్యమని చెప్పారు. వామపక్షాలు

- మిగతా 2 లో

ఏపీ సీపీఐ నూతన కార్యదర్శివర్గం ఇదే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యదర్శివర్గాన్ని విజయవాడ దాసరిభవన్‌లో పి.రామచంద్రయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర సమితి సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యతోపాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా జేవీ సత్యనారాయణమూర్తి, పి.హరినాథరెడ్డి, కేవీవీ ప్రసాద్, డి.జగదీశ్, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, తాటిపాక మధు, పి.దుర్గాభవాని, కె.రామాంజనేయులు, శాశ్వత ఆహ్వానితులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ ఎన్నికయ్యారు.

హైదరాబాద్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

కేటీఆర్ సవాల్

విశాలాంధ్ర- హైదరాబాద్:
హైదరాబాద్‌లో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో ధైర్యముంటే చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామన్న భయంతోనే రేవంత్ రెడ్డి ఏదేదో మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఆయన భాషలో ఆయనకు అర్థమైయేటట్లు చెప్పే సత్తా తమకు ఉందని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి మమ్మల్ని తిట్టినా... మేం మాత్రం గౌరవంగానే మాట్లాడుతామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ఏం చేసిందో... రెండేళ్లలో రేవంత్ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాం.. తమ హయాంలో స్టార్ట్ చేసినవాటికే కాంగ్రెస్ రిబ్బన్ కట్ చేసిందని వివరించారు. అవి కాకుండా.. కొత్తగా ఈ రెండేళ్లలో ఒక్క రోడ్డు

- మిగతా 2 లో

అమెరికాకు చైనా ఉపశమనం

బీజింగ్: అమెరికా వస్తువులపై అదనంగా విధించిన 24 శాతం సుంకాల రద్దు కాలాన్ని పొడిగిస్తున్నట్లు చైనా ప్రకటించింది. ఏడాది పాటు మినహాయింపు ఇవ్వడంతో 10 శాతం సుంకాన్నే అమెరికా చెల్లించాల్సి ఉంటుంది. నవంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. అమెరికా-చైనా అధ్యక్షుడు దక్షిణ కొరియా వేదికగా భేటీ అయిన క్రమంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఫెంటనైల్ పేరుతో చైనాపై 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. మొత్తం విధించిన సుంకం 57శాతం నుంచి 47శాతానికి తగ్గింది. అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను పునరుద్ధరించేందుకు చైనా అంగీకరించింది. చైనా నుంచి అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఇబ్బంది ఉండదని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్-జిన్‌పింగ్ భేటీ క్రమంలో వాణిజ్య ఒప్పందం కుదరనున్నట్లు రెండు దేశాల అధికార వర్గాలు సంకేతాలిచ్చాయి.

భారత్‌కు సహాయం...

దిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్న నేపథ్యంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా సిద్ధంగా ఉందని భారత్‌లోని చైనా దౌత్యకార్యాలయం అధికారి యూజింగ్ వెల్లడించారు. ఒకప్పుడు చైనా కూడా ఇలాంటి సమస్యతో ఇబ్బంది పడిందని, తమ అనుభవాలను భారత్‌తో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్ త్వరలోనే ఈ సమస్య నుంచి బయట పడగలదని ఆకాంక్షించారు. గతంలో చైనా రాజధాని బీజింగ్‌తో పాటు అనేక నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించింది. గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి చైనా ప్రభుత్వం నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది.

దీనివల్ల నగరాల్లో గాలి నాణ్యత మెరుగైంది. స్వచ్ఛత చేకూరింది. భారత్‌లోనూ వాయు కాలుష్య నియంత్రణకు చైనా తరహా కఠిన చర్యలు అనుసరణీయమన్న అభిప్రాయం నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది. చైనాను ఆదర్శకంగా తీసుకొని దేశ పరిస్థితులకు, సవాళ్లకు అనుగుణమైన విధానాన్ని అమలు చేయాలన్న సూచనలు అందుతున్నాయి.

ప్రకృతి విలయం

ఫిలిప్పీన్స్ వరదల్లో 90 మంది మృతి

ఇండోనేసియాలో భారీ భూకంపం

మనీలా: ప్రకృతి విపత్తులతో ఫిలిప్పీన్స్, ఇండోనేసియా అల్లాడిపోతున్నాయి. గతనెల వరుస భూకంపాలు ఫిలిప్పీన్స్‌ను వణికించగా ప్రస్తుతం కల్మేగీ తుపాను కారణంగా భారీ వర్షాలు, వరదలు ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. 90 మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు. మరో 26 మంది గల్లంతయ్యారు. సెప్టెంబర్‌లో వచ్చిన భారీ భూకంపం నుంచి కోలుకుంటున్న ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు రావడంతో ప్రజలు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అటు ఇండోనేసియాలో వారం వ్యవధిలో రెండోసారి భారీ భూకంపం సంభవించింది. సులవేసి ద్వీపంలో బుధవారం ఉదయం 6.2 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు ఇండోనేషియా జియోఫిజిక్స్ ఏజెన్సీ తెలిపింది. ఈ భూకంపం ధాటికి ఉత్తర తీర ప్రాంతాల్లో ప్రకంపనలు సంభించాయి. సునామీ ముప్పు లేదని అధికారులు తెలిపారు. భూకంపం రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వారం రోజుల్లో రెండోసారి భూకంపం రావడంతో వణికిపోయారు. ఇటీవల మలుకు దీవుల సమీపంలో బండా సముద్రంలో 137 కిలోమీటర్ల లోతులో 6.6 తీవ్రతతో భూకంపం వచ్చిన విషయం విదితమే.

కార్గో విమానం కూలి ముగ్గురి దుర్మరణం

వాషింగ్టన్: అమెరికాలోని లూయిస్‌విల్లేలో విమాన ప్రమాదం జరిగింది. మెక్‌డోనెల్ డగ్లస్ ఎండీ-11 రకానికి చెందిన యూపీఎస్ కార్గో విమానం టేకాఫ్ అవుతుండగానే కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. యూపీఎస్ ఫ్లైట్ నంబర్ 2976 విమానం హోనులులుకు సాయంత్రం 5.15 గంటలకు (అమెరికా కాలమానం) బయల్దేరింది.

నిమిషాల వ్యవధిలోనే ప్రమాదానికి గురైంది. దీనిని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ధ్రువీకరించింది. ఒక్కసారిగా మంటలు రావడంతో విమానం కూలిపోయింది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమంలో వైరలయ్యాయి.

అధ్వాన పాలనను అడ్డుకోకపోతే అధోగతే

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మవిమర్శనాదృష్టితో లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చినప్పుడే మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని గద్దె దించగలమని చెప్పారు. ఇండియా ఐక్యసంఘటన బలోపేతం కావడానికి కాంగ్రెస్ చొరవ చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై బీజేపీ సైతం మద్దతునిచ్చిందని, అయితే కేంద్రంలో బీజేపీ నాటకాలాడుతూ బీసీ వర్గాలను దగా చేస్తున్నదన్నారు. సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు సందర్భంగా డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో కనీవినీ ఎరుగనిరీతిలో జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటీకరణ, అప్పులు, అవినీతితో చంద్రబాబునాయుడు ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని విమర్శించారు. విద్య, వైద్యం వంటి ప్రాధాన్యత రంగాలతోపాటు సర్వం ప్రైవేటీకరణ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి జరుగుతున్నదన్నారు. 70 శాతం ప్రాథమిక విద్యను ప్రైవేటువారి చేతుల్లో పెట్టిన కూటమి సర్కారు... మెడికల్ కాలేజీలన్నింటినీ అమ్మేసిందని, ఇకపై ఉన్నతవర్గాలకు తప్ప సామాన్యుడికి వైద్య విద్య అందే పరిస్థితి లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తూ స్టాఫ్ కొరతతో యూనివర్సిటీలు మూతపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని జగన్ ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన చంద్రబాబు... ఇప్పుడు అంతకుమించిన అప్పులతో రాష్ట్రాన్ని మరిన్ని కష్టాల్లోకి నెట్టేశారన్నారు. కేవలం 17 నెలల కాలంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయనంతగా రెండున్నర లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రికార్డు సృష్టించారని దుయ్యబట్టారు. ఇందులో రూ.1,40,000 కోట్లు బడ్జెట్ అప్పులే ఉన్నాయని, ప్రతి మంగళవారమూ అప్పు తీసుకోవడాన్ని ఆనవాయితీగా పెట్టుకోవడం విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలనాచరిత్రలోనే అడ్డుఅదుపూలేని అవినీతిని చూడాల్సి వస్తున్నదని, రూ.10,000 కోట్ల విలువైన ఒక ఊరినే అనంతపురంలో కబ్జా చేయడానికి అధికారపార్టీ నాయకులు యత్నిస్తున్నారంటే... టీడీపీ అవినీతి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతున్నదని అన్నారు. మోదీకి మరింత దగ్గరవుతున్న చంద్రబాబు రాష్ట్రంలో పక్కా ఎన్‌డీఏ పాలనకు తెరతీశారని, గాడితప్పిన కూటమి ప్రభుత్వం రాబోయే రోజుల్లో అభాసుపాలు కావడం ఖాయమని రామకృష్ణ అన్నారు. ఈ విధానాలను పార్టీ కార్యకర్తలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీహార్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వ ఓటమి ఖాయమని, తేజస్వీ యాదవ్ నాయకత్వంలో మహాగట్బంధన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీహార్‌లో కులంతోపాటు భూ సమస్య వేధిస్తున్నదని, భూసమస్యపై పోరాడిన చరిత్ర కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందని, 9 స్థానాల్లో పోటీ చేస్తున్న సీపీఐకి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు చాలా కీలకమన్నారు. తీవ్ర పేదరికం నుంచి కేరళను విముక్తి చేసిన ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ విధానాలు దేశానికే మార్గదర్శకమని అన్నారు. నూటికి నూరు శాతం దుర్భర దారిద్ర్యాన్ని తొలగించడంతోపాటు వందశాతం అక్షరాస్యత, భూసంస్కరణలు అమలు చేసిన ఏకైక రాష్ట్రంగా కేరళ నిలిచిందని, మానవ అభివృద్ధి సూచీలోనూ ముందంజలో నిలిచిందని కొనియాడారు. కమ్యూనిస్టుల పాలనలో కేరళ అభ్యున్నతి సాధించడం గర్వంగా ఉందన్నారు.

జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల ముగింపు కార్యక్రమం పురస్కరించుకొని డిసెంబరు 26వ తేదీన జరిగే 'చలో ఖమ్మం' కార్యక్రమంలో ప్రతి జిల్లా నుంచి విస్తృతంగా పాల్గొనాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదే నెలలో 20 నుంచి 26వ తేదీ వరకు సీపీఐ శతవార్షికోత్సవం జరపాలని, వాడవాడలా ఎర్రజెండాలు రెపరెపలాడాలని కోరారు. సామాజిక న్యాయంపై నవంబరు 18వ తేదీన జరిగే ఆందోళన కార్యక్రమాలు అన్నిజిల్లాల్లో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకొని నిర్వహించాలని, బీసీ జనగణనపై సీపీఐతో కలిసివచ్చే అన్ని పక్షాలను కలుపుకుపోవాలని, రాబోయే స్థానిక ఎన్నికల పోరుకు సిద్ధం కావాలని కోరారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా 12న జరిగే 'చలో అనంతపురం'తో ముగుస్తుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవంబరు 14న 300 మందితో బాలసంఘాన్ని పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. 18, 19 తేదీల్లో రైతుసంఘం అధ్వర్యంలో కర్నూలులో జరిగే పత్తి రైతుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత అమరవీరులకు నివాళులర్పిస్తూ సీపీఐ కార్యదర్శివర్గసభ్యులు తాటిపాక మధు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, సభికులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. సమితి సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రనాయక్, పెంచలయ్య విప్లవ గీతాలు ఆలపించారు.

కాంగ్రెస్ అంటేనే కరెంట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వమే విద్యుత్ శాఖకు చెల్లిస్తుందని తెలిపారు. పరిగి నియోజకవర్గం లో 1000 కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులను మంజూరు చేశామన్నారు. 9 సబ్ స్టేషన్ లతోపాటు 33/11 కేవీ, 400కేవీ సబ్ స్టేషన్ తో పాటు 220 కేవీ సబ్ స్టేషన్ ను మంజూరు చేశామన్నారు. పరిగి నియోజకవర్గం అభివృద్ధి కోసం రామ్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. నావెల్ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు వేల కోట్ల సాధన కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని, అయితే గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు పట్టించుకోలేదన్నారు. డిఫెన్స్ కు సంబంధించి 3000 కోట్లు రావడం ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో పరిగి నియోజకవర్గం లో పారిశ్రామిక అభివృద్ధి కోసం విద్యుత్తు సబ్ స్టేషన్ లు పెద్ద ఎత్తున మంజూరు చేశామని వాటికి భూమి పూజ కూడా చేశామన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆయా కుటుంబాలు అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మన్నెగూడ నుంచి బీజాపూర్ వరకు రోడ్డు మంజూరు అయిందని, అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు వేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్జీటీ 2 లో ఉన్న కేసును తొలగించడం కోసం కృషి చేయడం వల్ల నాలుగు లైన్ల రహదారి పనులు వేగంగా నడుస్తున్నాయన్నారు. కొద్దిమంది ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ వల్ల పేదలకు నష్టం జరిగిందంటున్నారని, పదేళ్లలో అప్పటి ప్రభుత్వం చేసిన పనుల గురించి చెబితే, ఏ ఒక్క పని కాలేదు అన్నది స్పష్టమవుతుందన్నారు. గత ప్రభుత్వం కుటుంబానికి మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిందని అందులో ఒక్కటైనా అమలైందా అని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టు కడతామని చెప్పి మోసం చేసిందని దుయ్యబట్టారు. కృష్ణా నదిపై ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని, గోదావరిపై లక్ష కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు సంగతి ఏమైందో ప్రజలందరికి తెలుసనన్నారు గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని చెప్పి ఏ ఒక్క నిరుపేదకు ఇల్లు కట్టించి ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసి ప్రతి ఇంటికి 5 లక్షల చొప్పున కేటాయించామని, రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. ఈ విషయంపై ప్రతిపక్షాలకు తాను చాలెంజ్ విసురుతున్నానని... ఏ నియోజకవర్గానికి వచ్చినా కూడా ఇళ్ల నిర్మాణం చూపిస్తానని తెలిపారు. 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 93 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షలతో ఏ ఆసుపత్రికి వెళ్లిన వైద్యం అందిస్తున్నామన్నారు. కేవలం సంక్షేమం కోసమే 1.60లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట

తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ అధ్వర్యంలో వారానికి మూడు రోజులు ప్రజాబాట నిర్వహించ బోతుందని భట్టి తెలిపారు. ౨. విద్యుత్ శాఖ అధికారులే ప్రజల వద్దకు వెళ్తారని అంబులెన్స్ లాగా ఒక వాహనం కూడా ఉంటుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచబోతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ ను ఎవరు ఆపలేరని ఏ ఒక్క ప్రతిపక్షం కూడా ఆపలేదని స్పష్టం చేశారు. ప్రజలను మభ్య పెట్టే విధంగా కాంగ్రెస్ పాలన చేయదని , ప్రతిక్షణం ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, ఇది కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమని అన్నారు.

ట్రంప్ పాలనకు ఛీత్కారం

(మొదటిపేజీ తరువాయి)

డెమొక్రాట్లు చెక్ పెట్టారు. ఎక్కడికక్కడ మెజారిటీ సాధించారు. ట్రంప్ పాలనపై ప్రజా వ్యతిరేకతకు ఈ ఫలితాలు అద్దంపట్టాయి. కొత్తగా ఎన్నికైన మేయర్లు, గవర్నర్లు తమ విజయోత్సవ సభల్లో ట్రంప్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సుంకాల పాలన అంటూ దుయ్యబట్టారు. కార్మికులపై దాడులను ఆక్షేపించారు.

ట్రంప్ 2.0 పాలనలో జరిగిన తొలి మేయర్ ఎన్నికలను డెమొక్రాట్లు క్లీన్‌స్వీప్ చేయడం పెద్దఎత్తున చర్చకు దారితీసింది. ట్రంప్ యంత్రాంగంపై ప్రజాభిప్రాయ సేకరణగా ఈ ఎన్నికను నిపుణులు భావించారు. ట్రంప్ నిరంకుశత్వాన్ని ప్రజలు తిరస్కరించారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. న్యూయార్క్‌తో పాటు కాలిఫోర్నియా, న్యూ జెర్సీ, వర్జీనియాల్లోనూ డెమొక్రాట్లు ప్రభంజనం సృష్టించారు.

న్యూయార్క్ మేయర్‌గా డెమొక్రాట్ అభ్యర్థి జొహ్రాన్ మమ్దానీ (34) చారిత్రక విజయం సాధించారు. న్యూజెర్సీలోనూ డెమొక్రాట్ అభ్యర్థి మైకీ షెర్రి విజేతగా నిలిచారు. 1960 దశకం తర్వాత వరుసగా మూడుసార్లు న్యూజెర్సీ గవర్నర్ పదవి డెమొక్రాట్లకు దక్కడం విశేషం. వర్జీనియా మేయర్‌గా అబిగెయిల్ స్పాన్‌బర్గర్, లెఫ్టినెంట్ గవర్నర్‌గా భారత సంతతికి చెందిన గజాలా హాష్మీ (61) ఎన్నికయ్యారు. దక్షిణాసియా మూలాలున్న తొలి ముస్లిం లెఫ్టినెంట్ గవర్నర్‌గా హాష్మీ నిలిచారు. రిపబ్లికన్ జాన్ రైడ్‌ను చిత్తు చేశారు. ఓహియో రాష్ట్రంలోని సిన్సినాటి నగర మేయర్‌గా భారత సంతతికి చెందిన అఫ్తాబ్ పురేవాల్ (43) ఎన్నికయ్యారు. రిపబ్లికన్ అభ్యర్థి, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సోదరుడు కోరి బ్రోమన్‌పై అఫ్తాబ్ విజయం సాధించారు. రెండవసారి మేయర్‌గా ఎన్నికయ్యారు. అఫ్తాబ్ తల్లి టిబెట్‌కు చెందిన వారు కాగా, ఆయన తండ్రి పంజాబీ.

ఎన్నికలు జరిగిన స్థానాల్లో చాలా వరకు గతంలో ట్రంప్‌కు అనుకూలమే అయినప్పటికీ రిపబ్లికన్ అభ్యర్థులను ప్రజలు తిరస్కరించారు. జొహ్రాన్ మమ్దానీకి వ్యతిరేకంగా ట్రంప్ పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఆయన ఎన్నికైతే న్యూయార్క్ నాశనమవుతుందని హెచ్చరించారు. కానీ న్యూయార్క్ ప్రజలు అధ్యక్షుడి మాటలను లెక్కచేయలేదు. మమ్దానీకి చారిత్రక విజయాన్ని అందించారు. దశాబ్దాల తర్వాత భారీగా పోలింగ్ జరిగిందని, 20 లక్షల మందికిపైగా ఓటేశారని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

మమ్దానీ నోట నెహ్రూ మాట

న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దానీ తన విజయోత్సవ సభలో ప్రసంగిస్తూ భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను గుర్తుచేసుకున్నారు. 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావించారు. 'నవశకం వైపు అడుగు వేసినప్పుడు, ఒక శకం ముగిసినప్పుడు, సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి గళం వినిపించినప్పుడు... చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి' అని అన్నారు.

రిచర్డ్ అనే ట్యాక్సీ డ్రైవర్‌తో కలిసి సిటీ హాల్ వెలుపల 15 రోజులు దీక్ష చేయడం గురించి ప్రస్తావించారు. తన తల్లిదండ్రులకు, ప్రత్యేకించి యువతరానికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ రాజవంశాన్ని కూల్చేశామంటూ ట్రంప్‌నకు చురకలు అంటించారు. 'ట్రంప్... మీరు చూస్తున్నారని తెలుసు. మీకు నాలుగు మాటలు చెబుతా.

సౌండ్ పెంచి వినండి. మీరు మాలో ఎవరిని చేరుకోవాలంటే మా అందరినీ దాటాల్సి ఉంటుందని గుర్తుపెట్టుకోండి. మీకు జన్మనిచ్చిన నగరంలో ఓడిపోయారని మరవొద్దు' అని డెమొక్రాట్ నేత వ్యాఖ్యానించారు. తన ప్రత్యర్థి, మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోను ఉద్దేశించి వ్యక్తిగత జీవితంలో ఉత్తమంగా ఉండాలని మమ్దానీ సూచించారు.

ఓటమికి ఆ రెండే కారణాలు: ట్రంప్

తాజా ఎన్నికల ఫలితాలపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తంచేశారు. రిపబ్లికన్ పార్టీ ఓటమికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని చెప్పారు. మొదటిది బ్యాలెట్‌పై తన పేరు లేకపోవడమని, రెండవది... నెల రోజులుగా షట్‌డౌన్ కొనసాగుతుండటమని వెల్లడించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. కాలిఫోర్నియాలో రిగ్గింగ్ జరిగిందని కూడా ఆరోపించారు. 'రాజ్యాంగానికి విరుద్ధమైన రీ మ్యాపింగ్ పేరుతో కాలిఫోర్నియా ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. మెయిల్-ఇన్ ఓట్లు పక్కనబెట్టేయడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశం' అని ట్రంప్ వెల్లడించారు.

బీజేపీ ఓట్ల చోరీకి ఈసీ సహకారం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ ఈ సంగతి తెలిపారు. గతంలో ఓట్ల చోరీకి సంబంధించి హైడ్రోజన్ బాంబు లాంటి సమాచారం తమ వద్ద ఉందని రాహుల్ చెప్పారు. అయితే ఇప్పుడు హైడ్రోజన్ బాంబు లాంటి సమాచారంతో కూడిన డాక్యుమెంట్లను 'హెచ్' ఫైల్స్‌గా రాహుల్ అభివర్ణించారు. బీజేపీ ఓట్ల చోరీకి ఎన్నికల సంఘం సహకరిస్తోందనేందుకు 'హెచ్' ఫైల్స్ సాక్ష్యంగా నిలుస్తాయని... అవి తమ చేతిలో ఉన్నాయన్నారు. 100 శాతం రుజువులతో తాను మాట్లాడు తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తో పాటు ఇద్దరు కేంద్ర ఎన్నికల కమిషనర్లు బీజేపీతో చేతులు కలిపి హర్యానాలో ఆ పార్టీని గెలిపించారని రాహుల్ ఆరోపించారు. ఆ ఎన్నికల అధికారులు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పొత్తు పెట్టుకున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు 'ఆపరేషన్ సర్కార్ చోరీ'ని నిర్వహించారని...ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని దేశంలోని జెన్-జీ యువతకు పిలుపునిచ్చారు. ఓట్లచోరీ ద్వారా జెన్-జీ నుంచి భవిష్యత్తును లాక్కుంటున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. ఇళ్లు లేని వాళ్లకు ఇంటి నంబరుగా జీరోను కేటాయిస్తామని దేశ ప్రజలకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అబద్ధాలు చెబుతున్నారని, ఆ ఇళ్ల పేరుతో ఏం జరుగుతోందో ఇప్పుడు అందరికీ తెలిసిపోయిందని రాహుల్ పేర్కొన్నారు. డూప్లికేట్ ఓట్లను ఎందుకు తొలగించడం లేదని ఈసీని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ వాటిని తొలగిస్తే ఎన్నికల్లో సరైన ఫలితం వస్తుందన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయానికి హర్యానాలో మొత్తం 2 కోట్ల మంది ఓటర్లు ఉండగా... 25 లక్షల మంది నకిలీ ఓటర్లేనని రాహుల్ తెలిపారు. ఒక బ్రెజీలియన్ మోడల్ ఫొటోతో ఓట్లను రిజిస్టర్ చేయించి, చాలా ఎన్నికల బూత్‌లలో ఓట్లు వేయించారు. ఈ లెక్కన ప్రతీ 8 మంది ఓటర్లలో ఒకరు నకిలీ ఓటరే. అంటే దాదాపు 12.5 శాతం మంది నకిలీ ఓటర్లు రాష్ట్రంలో ఉన్నారు. పోస్టల్ ఓట్లు, బూత్ ఓట్ల లెక్కల్లోనూ పెద్ద తేడాలు కనిపిస్తున్నాయి. దీనిపై మా పార్టీ దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. హర్యానా రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల చోరీ జరిగింది. అందుకే దానికి సంబంధించిన ఆధారాలకు హెచ్-ఫైల్స్ అనే పేరు పెట్టామని చెప్పారు. ఒకే ఒక్క ఫొటోపై 223 ఓట్లను జారీ చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. బ్రెజీలియన్ మోడల్ ఫొటోతో ఓ మహిళ 10 వేర్వేరు పోలింగ్ బూత్‌లలో 22 సార్లు ఓట్లు వేసింది. ఇంతకీ ఆమె ఎవరు ? ఆమె ఓట్లు వేసిన అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ 22వేల ఓట్ల తేడాతో ఓడిపోయింది. ఇలాంటి 25 లక్షల ఓట్లు హర్యానాలో ఉన్నాయని రాహుల్ గాంధీ వివరించారు. ఓట్ల చోరీ హర్యానాలోని ఏదో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గానికి పరిమితం కాలేదని మాకు అనుమానం కలుగుతోంది. ఈ వ్యవహారం రాష్ట్రాల స్థాయిలో, జాతీయ స్థాయిలోనూ జరిగి ఉండొచ్చు. ఏదో అనుమానాస్పదంగా జరుగుతోందని హర్యానాలో మా అభ్యర్థుల నుంచి 2024 అసెంబ్లీ ఎన్నికల టైంలో సమాచారం వచ్చింది. వాళ్లందరి అంచనాలు, అనుమానాలు నిజమని చివరకు తేలింది. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ మేం ఇలాంటి చేదు అనుభవాన్నే ఎదుర్కొన్నాం. అందుకే హర్యానాలో ఓట్లచోరీపై మేం పూర్తి ఫోకస్ పెట్టి యావత్ సమాచారాన్ని సేకరించాం. ఓట్లచోరీ వల్లే గెలవాల్సిన హర్యానాను మేం కోల్పోయామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ఆ జాబితాలు చూసి షాక్‌కు గురయ్యా...

అన్ని ఎగ్జిట్ పోల్స్ హర్యానాలో కాంగ్రెసే గెలుస్తుందని చెప్పినప్పటికీ ఆశ్చర్యకరంగా ఆ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా వాస్తవ ఓట్ల సంఖ్యలో, పోస్టల్ ఓట్ల సంఖ్యలో తేడా వచ్చింది. మునుపెన్నడూ అలా జరగలేదు. అందుకే మేం ఓట్లచోరీ అంశంపై దృష్టి పెట్టడంతో అక్రమాలు బయట పడ్డాయని రాహుల్ తెలిపారు. దీనితో ముడిపడిన సమాచారాన్ని సేకరించి చూసి తాను మొదట నమ్మలేకపోయానని, షాక్‌కు గురయ్యానని తెలిపారు. మరిన్ని సార్లు ఆ సమాచారాన్ని క్రాస్ చెక్ చేయించాకే హెచ్-ఫైల్స్‌పై నిర్ధారణకు వచ్చానన్నారు. హర్యానాలో జరిగిన ఓట్లచోరీ గురించి నేను 100 శాతం ఆధారాలతో మాట్లాడుతున్నట్లు రాహుల్ స్పష్టం చేశారు. దేశంలోని ప్రజాస్వామిక ప్రక్రియ ఏమైందో ఈసీ చెప్పాలని ఆయన నిలదీశారు. కేవలం ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఇదంతా చేశారన్నారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రెండు రోజుల ముందు సీఎం నయాబ్ సైనీ చిరునవ్వులు చిందిస్తూ, ఈ ఎన్నికల్లో గెలవడానికి తమకొక 'వ్యవస్థ' ఉందని చెప్పారు. ఆ వ్యాఖ్యను అందరూ గుర్తు చేసుకోవాలిలని రాహుల్ గాంధీ గుర్తు చేశారు.

ఒక్క ఫిర్యాదు రాలేదు: ఈసీ

ఈ సంచలన ఆరోపణలతో రాహుల్ గాంధీ మీడియా సమావేశం కొనసాగుతుండగానే ఎన్నికల సంఘం(ఈసీ) అధికార వర్గాలు స్పందించాయి. హర్యానాలో ఓటర్ల జాబితాలపై ఒక్క అప్పీల్ కూడా దాఖలు కాలేదని వారు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లలో కాంగ్రెస్ ఏజెంట్లు ఏం చేస్తున్నారని ఈసీ అధికారులు ప్రశ్నించారు. ఎవరైనా వ్యక్తి ఇప్పటికే వేరొక చోట ఓట్లు వేసి ఉంటే అభ్యంతరం తెలపాల్సిన బాధ్యత కాంగ్రెస్ ఏజెంట్లపై ఉంటుందన్నారు. ఎవరైనా ఓటరు సమాచారంపై సందేహాలున్నా కాంగ్రెస్ ఏజెంట్లు అడగొచ్చని సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని రాహుల్ గాంధీని ఈసీ కోరింది. దేశ పౌరసత్వాన్ని తనిఖీ చేస్తూనే డూప్లికేట్ ఓటర్లు, చనిపోయిన ఓటర్లు, వలస వెళ్లిపోయిన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించడంలో తప్పేం ఉందని ఎన్నికల సంఘం ప్రశ్నించింది. ఈ ప్రక్రియను కూడా రాహుల్ గాంధీ వ్యతిరేకిస్తున్నారా అని నిలదీసింది.

ఒక్కటైన 10 వామపక్షాలు

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం జరిగిన జాతీయ ఐక్యతా సమావేశంలో భాగంగా వీరి ఎన్నిక జరిగింది. ఇదే కార్యక్రమంలో ఏకీకృత నేపాలీ కమ్యూనిస్టు పార్టీని అధికారికంగా ప్రకటించారు. మేనిఫెస్టోను ఆమోదించారు. కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ నిర్మాణంపై తుది నిర్ణయం మరో ఆరు నెలల్లో జరగబోయే జాతీయ ఐక్యతా సదస్సులో జరగనున్నట్లు నాయకులు ప్రకటించారు. కాగా, నేపాల్ కమ్యూనిస్టు పార్టీలో కేంద్ర కమిటీ, రాజకీయ కమిటీ, కార్యదర్శి వర్గం, కార్యనిర్వాహక సమన్వయ కమిటీ ఉంటాయని ఒప్పందం తెలిపింది. నూతన పార్టీకి మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాలే మార్గదర్శకం కాగా శాస్త్రీయ సోషలిజం కోసం ఇది పనిచేస్తుంది. నేపాల్‌కు అనుగుణమైన రాజకీయ కార్యక్రమాన్ని రూపొందించుకోనున్నది. ప్రజాస్వామిక విప్లవాల ద్వారా సాధించిన లక్ష్యాల పరిరక్షణకు నేపాల్ కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుందని ఒప్పందం పేర్కొంది. సోషలిజం విస్తరణకు క్షేత్రస్థాయిలో అనుకూల పరిస్థితులు సృష్టించడంపై దృష్టి కేంద్రీకరిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రజా ఉద్యమాలు శాంతియుతంగా జరుపుకోవడం, అవసరమైన రంగాలతో పాటు వీధి పోరాటాలు, పార్లమెంటులో పోరాటాలు సాగించడం కోసం కార్యాచరణ రూపొందిస్తుందని పేర్కొంది. నేపాల్ సోషలిస్టు విప్లవ లక్ష్యాల సాధన కోసం కమ్యూనిస్టు ఉద్యమం ఏకీకరణ చారిత్రక అవసరమని ఒప్పందం నొక్కిచెప్పింది. సమాజాన్ని శాస్త్రీయ సోషలిజం వైపు నడిపించేందుకు కృషి చేయాలని నిర్ణయించింది. అదే విధంగా సమాఖ్య ప్రజాస్వామ్యం, గణతంత్రం, జాతీయ సార్వభౌమాధికారం, సుపరిపాలన, సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి సాధకు నేపాలీ కమ్యూనిస్టు పార్టీ సంకల్పించింది. తమ ఎన్నికల చిహ్నంగా నక్షత్రాన్ని ఎంపిక చేసుకున్నది.

గ్రూప్-1 మెయిన్స్‌పై విచారణ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

కూడా అందిస్తామని తెలిపారు. ఏపీపీఎస్సీ అధికారులు, రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) కలిసి ఆన్సర్ షీట్లు పరిశీలించి... జాబితా తయారు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఆ ఆన్సర్ షీట్లను భద్రపరచాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

నేడు అమరావతికి చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లారు. అయినప్పటికీ పర్యటనను ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న సీఐఐ సదస్సు జయప్రదానికి ముఖ్యమంత్రి సద్వినియోగం చేసుకున్నారు. పారిశ్రామిక వేత్తలతో సీఎం వరుస భేటీలు జరుపుతూ విశాఖకు రావల్సిందిగా ఆహ్వానించారు. అక్టోపస్ ఎనర్జీ గ్రూప్ డైరెక్టర్ క్రిస్ ఫ్రిట్జ్ గెరాల్డ్, హిందూజాకు చెందిన వివిధ సంస్థల చైర్మన్‌లు అశోక్ హిందూజా, ప్రకాష్ హిందూజా, షోమ్ హిందూజా, రోల్స్ రాయిస్ గ్రూప్ చీఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసర్ నిక్కీ-గ్రాడీ స్మిత్, శ్రామ్ అండ్ మ్రామ్ సంస్థ చైర్మన్ శైలేష్ హీరానందాని, శ్యామ్ కో హోల్డింగ్స్ చైర్మన్ సంపత్ కుమార్, ఆ సంస్థ సీఈఓ, డైరెక్టర్లు వైద్యనాథన్, అశ్వినీ సంపత్ కుమార్‌తో పాటు కొసరాజు గిరిబాబు వంటి వారితో సీఎం సమావేశమయ్యారు. మరోవైపు వివిధ పారిశ్రామిక వేత్తలతో సీఐఐ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని లండన్‌లోని ఇండియన్ హైకమిషనర్ దొరైస్వామితోనూ భేటీ అయ్యారు. మూడు రోజుల పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరుగు ప్రయాణ మయ్యారు. గురువారం సచివాలయంలో జరిగే వివిధ సమీక్షల్లో సీఎం పాల్గొననున్నారు.

గవర్నర్‌కు డాక్టరేట్ పట్ల హర్షం

కర్నాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం నుంచి ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రతిష్టాత్మక డాక్టర్ ఆఫ్ లాస్ డిగ్రీని అందుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ గౌరవం... చట్టం, న్యాయం, ప్రజాసేవలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన కృషిని ప్రతిబింబిస్తోందంటూ ఎక్స్ ఖాతా వేదికగా అభినందించారు. మంత్రి నారా లోకేశ్ కూడా మరొక ప్రకటనలో ఇది ఏపీ ప్రజలకు గర్వకారణమంటూ అభినందించారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

అయినా నిర్మించావా అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. కొత్త రోడ్ల సంగతి తర్వాత.. కనీసం రోడ్లపై పడిన గుంతలైనా పూడ్చారా అని నిలదీశారు. నగర ప్రజలకు మళ్లీ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో శానిటేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ కూడా సీఎంగా ఒక ఏరియాను ఎంచుకొని అక్కడ శానిటేషన్ పనులు పర్యవేక్షించారని గుర్తు చేశారు. స్వచ్ఛ్ హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. వేలాది స్వచ్ఛ్ ఆటోలను ప్రవేశపెట్టామని అన్నారు. ఇప్పుడు కనీసం ఒక్క ఆటోనైనా ప్రవేశపెట్టారా అని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తమ హయాంలో ప్రతి రోజు 7.5 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించామని వెల్లడించారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు సాధించామని తెలిపారు. బెస్ట్ క్వాలిటీలో నెంబర్ వన్ సిటీగా హైదరాబాద్‌కు అవార్డు వచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడే ఎస్ఎన్‌డీపీని కూడా స్టార్ట్ చేసినట్లు తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మారిస్తే.. ఇప్పుడు దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మురికికూపంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక.. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించిదని గుర్తు చేశారు కేటీఆర్. ఈ రెండేళ్లలో ఒక్క ఇళ్లైనా కట్టారా అని ప్రశ్నించారు.

అంగన్వాడీ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : మంగళవారం, ఖానాపూర్ ప్రాజెక్టులోని అంగన్వాడీ ఆయాలకు ప్రాజెక్టు మీటింగ్ పెట్టి,ప్రతిరోజు ఆయాలు సమయపాలన పాటించాలి అంగన్వాడీ సెంటర్ శుభ్రంగా ఉంచుకోవాలి మెనూ ప్రకారం చేసి పిల్లలకు, గర్భిణులకు, భోజనం పెట్టాలి సెంటర్‌కి వచ్చిన ప్రతి పిల్లల్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు అంగన్వాడీ కేంద్రంలో జాగ్రత్తగా చూసుకోవాలి. పిల్లల్ని ఇంటికి పంపించేటప్పుడు ఇంటి వరకు వెళ్లి తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలి లేదా తల్లిదండ్రులు అంగన్వాడి సెంటర్‌కి వచ్చి తీసుకునే విధంగా టీచర్ ఆయాలు చర్యలు, చూసుకోవాలి ఎవరైనా పిల్లలు అంగన్వాడీ కేంద్రంలో టాయిలెట్ బాత్రూం వెళ్లినా కూడా అంగన్వాడీ ఆయాలు శుభ్రంగా కడగాలి. అంగన్వాడీ సెంటర్ చుట్టుపక్కల గుంతలు సంపులు మురికి నీరు లేకుండా చూసుకోవాలని సీడీపీఓ ఖానాపూర్ శ్రీలత జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రేమలత, శ్యామల రాధ, సెహనాజ్, పర్వీన్ యు డి సి పద్మారాణి పాల్గొన్నారు.

పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించాలి

విశాలాంధ్ర-మరిపెడ: రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు సూచించారు.బుధవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బురహాన్‌పురం గ్రామ శివారులోని పద్మావతి కాటన్ ఇండస్ట్రీస్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తికొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వవిప్ డాక్టర్ రామచంద్రనాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల, పెద్దబోయిన ఐలమల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. రైతులు పండించిన పత్తి పంటను ఎండబెట్టి తేమశాతం 8 నుండి 12 శాతం మధ్యలో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. రైతులను నాణ్యమైన పత్తి తీసుకువచ్చి మద్దతు ధర పొందడంతో పాటు కాపాస్ కిసాన్ యాప్ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్,మాజీ సర్పంచ్ బానోత్ రాంలాల్, కాంగ్రెస్ నాయకుడు అఫ్జల్,సీసీఐ అధికారి సింహాద్రి నాయుడు, కేసముద్రం మార్కెట్ సెక్రటరీ అమరలింగేశ్వరరావు, పత్తి మిల్లు యజమాని సుధాకర్ రెడ్డి,నాయకులు మచ్చా వెంకట నర్సయ్య, నల్లు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తన కంపెనీలతో జాగ్రత్తలు తీసుకోవాలి : రఘు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: మొక్క జొన్న పంట వేసే రైతులు, మొక్క జొన్న కంపెనీలతో, ముందుగానే, రైతులు అగ్రిమెంట్ చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం మండల కమిటి అధ్యక్షులు సి హెచ్ రఘు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలతో మోసపోవద్దని సూచించారు. ఏటూరునాగారం రైతులు మొక్కజొన్న ఏజెంట్ల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని,తీరా పంట చేతికి వచ్చే సరికి, పంట రాక పోతే అప్పుడు బాధ పడవల్సి వస్తుందని, అందుకని, రైతులు తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వారితో అగ్రిమెంట్ రాయించుకోవాలని అన్నారు. అలా కాక రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్,పోలబోయిన గోపాల్, సాధనపెల్లి లక్ష్మయ్య, తూర్పటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు ప్రతిరూపం ఎన్ఎస్ఎస్

విశాలాంధ్ర తొర్రూరు: సామాజిక సేవకు ప్రతిరూపం జాతీయ సేవా పథకం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వాల్యా నాయక్, డాక్టర్ సుజాతలు అన్నారు. తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ల ఆధ్వర్యంలో మండలంలోని చెర్లపాలెం గ్రామంలో బుధవారం రెండవ రోజు ప్రత్యేక శిబిరం కొనసాగింది. అంబేద్కర్ కాలనీ పరిసరాలలోని చెత్తాచెదారం, ముండ్ల కంపను, వ్యర్థాలను విద్యార్థులు తొలగించారు. డ్రైనేజీలను శుభ్రపరిచారు. అంతకుముందు నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్లు వాల్యా నాయక్, సుజాతలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత కల్పించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ లక్ష్యాలు సాకారమవుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలన్నారు. ప్రత్యేక క్యాంపుల ద్వారా విద్యార్థులు అనేక సామాజిక అంశాలు నేర్చుకుంటారని తెలిపారు. చదువుతోపాటు సామాజిక సేవలో ముందుంటేనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. నాకోసం కాదు- మీకోసం అనే భావనతో సమాజ సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నగేష్ బాబు, రాజేష్, సోమేశ్వర్, దుర్గాభవాని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం..

విశాలాంధ్ర- చర్ల : మండల పరిధిలోని కలివేరు పంచాయతీ బట్టిగూడెం గ్రామంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి ఆదివాసీ ఇర్ప నగేష్ ఇల్లు దగ్ధమైంది. నాగేష్ సోదరుడు ఇర్ప మున్నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇతని ఇల్లు నిర్మాణంలో ఉండటం వల్ల ఇర్ప నగేష్ ఇంట్లోనే రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ కుటుంబాలు పనికోసం చేలోకి వెళ్లడం జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో సర్వం దగ్ధమై రెండు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వెల్లడించారు. ఆర్థికంగా బాధల్లో ఉన్న ఈ కుటుంబాలను దాతలు ఆదుకోవాలని కొందరు గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.

పత్తి రైతుల సమస్యలపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : పత్తి రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మెకు వెళ్లకుండా పత్తి కొనుగోళ్లు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జిన్నింగ్ మిల్లుల యాజమాన్యం ఈ నెల 6 నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు ముందుగా కలెక్టర్‌కు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో మార్కెటింగ్, సిసిఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిన్నింగ్ మిల్లుల యజమానులు మాట్లాడుతూ సిసిఐ అమలు చేస్తున్న ఎల్-1, ఎల్-2 నిబంధనలు, తేమ శాతం పరిమితులు వంటి సమస్యల వల్ల పత్తి కొనుగోలు చేయడం కష్టమవుతోందని వివరించారు. తేమశాతంలో సడలింపు ఇవ్వాలని, ఎల్-1, ఎల్-2 నిబంధనలు

తొలగించాలని వారు కలెక్టర్‌ను కోరారు.దీనిపై స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, "పత్తి కొనుగోలు ప్రక్రియ పూర్తిగా సిసిఐ ఆధ్వర్యంలో జరుగుతుంది. అందువల్ల నిబంధనల సడలింపులు నా పరిధిలో లేవు అని తెలిపారు. అయితే మూడు నుండి నాలుగు రోజుల్లో అన్ని జిన్నింగ్ మిల్లులు కార్యకలాపాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, అప్పటివరకు సమ్మెకు వెళ్లకుండా పత్తి కొనుగోళ్లు కొనసాగించాలని జిన్నింగ్ మిల్లుల యజమానులను ఆమె కోరారు. ఈ సందర్భంగా సిసిఐ సీఎండీతో కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను వివరించారు. కలెక్టర్ విజ్ఞప్తికి జిన్నింగ్ మిల్లుల యజమానులు అంగీకరించి, పత్తి కొనుగోళ్లు కొనసాగించేందుకు సిద్ధమయ్యారు. కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశిస్తూ, రైతులు సరైన తేమ శాతం ఉన్న పత్తినే మిల్లులకు తెచ్చేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, అదనపు ఎస్పీ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ ఏడి చాయాదేవి, సిసిఐ అధికారి నింజే, జిన్నింగ్ మిల్లుల అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. కుల్చారం మండల పరిధిలోని సంగాయిపేట లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో ఇప్పటివరకు 34,520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని పరి శీలించారు. తేమశాతాన్ని పరిశీలించారు. రైతులు వరి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే సీరియల్ నెంబర్ల వారీగా ఎంత దాన్యం తెచ్చారు, ధాన్యం తేమ తెచ్చిన రోజు ఎంత ఉంది అనే వివరాలు రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు.

గోదారమ్మకు హారతి

విశాలాంధ్ర - భద్రాచలం : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గోదావరి నదీలా హైందవ సంప్రదాయం ప్రకారం హారతి క్రతువు నిర్వహించారు. ఈ ధార్మిక కార్యక్రమాన్ని అర్చకస్వాముల వేద మంత్రోచ్చరణల మధ్య అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. సాయంత్రం వేళ దేవస్థాన ఈవో కే. దామోదర్‌రావు ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ దేవస్థానం నుంచి చప్టా దిగువ మీదుగా గోదావరి ఒడ్డుకు భక్త జనంతో యాత్ర చేరుకుంది. ప్రధానార్చకుల ప్రత్యేక మంత్రోచ్చరణాలు పటిస్తుండగా మిగతా అర్చకస్వాముల బృందం గోదావరమ్మకు నదీ హారతిని సమర్పించారు. ఇది చూసిన భక్తజనం తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం గోదావరి నది తీరం వద్ద భద్రాచలం పట్టణ సిఐ నాగరాజుతో కలిసి ఈవో దామోదర్ రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తమ్ముడి ఇల్లు కబ్జా చేసిన అన్న... ఇంటిముందు బాధితుల ఆందోళన

విశాలాంధ్ర - ఇల్లందు : వర్తమాన సమాజంలో అక్రమ సంపాదనకు, ఆస్తులు కూడగట్టే నైజం ఉన్న వాళ్ళు అత్యాశతో తమపర బేధం, బంధుత్వాలు, రక్తసంబంధాలు మర్చిపోతున్నారు. సొంత తమ్ముడి ఆస్తిని అన్న ఆక్రమించాడని ఆరోపి స్తూ బాధిత కుటుంబం తమ సొంత ఇంటి ముందే ఆందోళనకు దిగాల్సిన దుస్థితి ఏర్పడింది. బుధవారం జరిగిన ఈ పరిణామం ఇల్లందు ప్రాంతంలో చర్చనీ అంశమైంది. వీరి తల్లిదండ్రులు రాములవారిపై ఉన్న భక్తితో ఇద్దరు కొడుకులకు రామస్వామి అని ఒకే పేరు ఎందుకు పెట్టారో కానీ ఆస్తిని ఆస్తి పంపకాల విషయంలో వివాదాస్పదమైంది. అన్న వేమూరి రామస్వామి తమ్ముడు రామస్వామి ఇంటిని ఆక్రమించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తమ్ముడు రామస్వామి కుటుంబంతో తన ఇంటి ముందే బైఠాయించి ఆందోళనకు దిగారు. వీరి తల్లిదండ్రులు చంద్రమ్మ, ముత్తయ్య పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ప్రాంతంలో సొంత ఇల్లు కట్టుకొని నివాసం వుండేవాళ్ళు. సింగరేణిలో ఉద్యోగం చేసిన ముత్తయ్య తన డిపెండెంట్ వారసుడిగా పెద్ద కుమారుడు రామస్వామికి ఉద్యోగం ఇప్పించాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. చిన్న కుమారుడైన మరో రామస్వామికి ఇంటిని రాసిచ్చాడని చెప్తున్నారు. కొన్నాళ్ళకు తాను స్వయం కృషితో సింగరేణిలో ఉద్యోగం సంపాదించానని బాధిత రామస్వామి చెప్పాడు. ఉద్యోగ రీత్యా మణుగూరు కుటుంబంతో అక్కడే రిటైర్ వరకు వున్నాడు. తన తల్లిదండ్రులు రాసిచ్చిన కరెంట్ ఆఫీస్ దగ్గరి ఇంటిని కిరాయికి ఇచ్చాడు. ఈ మధ్యనే తన సొంతింటిలో కుటుంబంతో ఉండేందుకు రిపేర్లు నిర్వహించుకునీ అతని కుటుంబం పాలు పొంగించుకుంది. తీరా ఈమధ్య ఇంట్లో సామాన్లు షిఫ్ట్ చేయాలనుకున్న దశలో అన్న రామస్వామి అడ్డుకొని ఇల్లు తన దంటూ కొందరు పెద్దలను సమీకరించుకొని డాక్యుమెంట్లను తమ్ముడికి చూపించాడు. దీంతో అన్న చేసిన దుర్మార్గాన్ని మీడియా ప్రతినిధుల ముందు ఆరోపిస్తూ తన కుటుంబం వీధిన పడేటట్టు చేసాడని ఆవేదన వ్యక్తం చేస్తూ తమ్ముడు ఇంటి ముందే తన కుటుంబంతో ఆందోళనలకు దిగాడు. తన అన్న కొందరు రాజకీయ నాయకులు రౌడీలను ఆశ్రయించి తనను బెదిరిస్తున్నాడని ఆరోపించాడు. ఈ అన్న దమ్ముల ఇంటి పేరుతోసాహ అసలు పేర్లు ఒకే ఉండటంతో లీగల్‌గా కిరికి ఏర్పడి ఈ కుటుంబంలో బలవంతుడిదే రాజ్యంలా మారిందని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు.

నిధుల మంజూరుపై హర్షం

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాలలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వాకర్స్ సౌకర్యార్థం నూతన వాకింగ్ ట్రాక్ కళాశాలలో హైమాక్స్ లైట్స్, టాయిలెట్స్, డ్రైనేజీ ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కోసం పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రభుత్వం తరుపున రూ.1 కోటి రూపాయల నిధులను మంజూరు చేపించినందుకు వాకర్స్ అసోసియేషన్ వారు పట్టణ ప్రజానీకం ఎమ్మెల్యే విజయరమణ రావుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెడుతూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు నిబద్ధత కలిగిన వ్యక్తి అని అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నూతన వాకింగ్ ట్రాక్ హైమ్యాక్స్ లైట్లు, టాయిలెట్స్, డ్రైనేజీ వ్యవస్థ, ఇతర అభివృద్ధి పనులకు రూ. 1 కోటి నిధులను మంజూరు చేపించడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే విజయరమణ రావు నేతృత్వంలో పెద్దపల్లి పట్టణం , నియోజకవర్గ అభివృద్ధి పథంలోకి దూసుకుపోతోందని పలువురు కొనియాడారు. అడిగిన వెంటనే ఐ.టి.ఐ కళాశాలను అభివృద్ధి పరుస్తున్న ఎమ్మెల్యే విజయ రమణ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వారు, మాజీ కౌన్సిలర్లు, పెద్దపల్లి పట్టణ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదం ప్రగతికి ప్రమాదకరం

విశాలాంధ్ర-వనపర్తి : దేశంలో మతోన్మాదం పెరగటం దేశ ప్రగతికి ఆటంకమని వామపక్ష ప్రజాసంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. వనపర్తి సిపిఐ ఆఫీసులో కవిజనజ్వాల రాధాకృష్ణ రచించిన 'జనజ్వాల మహా కవిత్వం'పుస్తకాన్ని భారత విప్లవోద్యమ నిర్మాత చంద్రపుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా ప్రోగ్రెస్ డెమోక్రటిక్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జే రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జనజ్వాల రాధాకృష్ణ, డా. భగవంతు, కొంకల నారాయణ, గణేష్, కేశవులు, వెంకటేష్, మోష తదితరులు మాట్లాడుతూ.. పాలకులు దేశంలో మతాన్ని పెంచిపోషిస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల్లో మతాన్ని ఎక్కించి సమస్యలపై పోరాడకుండాపక్క దారి పట్టిస్తున్నారు. వామపక్ష భావజాలమే దేశంలో ఉండే 90% మంది పేదలు ఎస్సీ,ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుంది అన్నారు. పార్టీలకతీతంగా వామపక్ష భావజాలం గల వారందరూ ఐక్యమై పోరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా చైతన్యానికి ప్రతిబంధకంగా పరిణమించే మతం కులం జాతి వివక్షతను ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఐక్యమైపోనాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రజాహక్కులను వామపక్షాలు మాత్రమే కాపాడగలవన్నారు. వాపక్షవాదులందరూ సంఘటితం కావలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. శ్రీరామ్, గోపాలకృష్ణ శ్రీహరి రవిచంద్ర సంఘ రక్షిత కుతుబ్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో :

కార్తీక పౌర్ణమి సందర్భంగా నల్గొండ పానగల్‌లోని ప్రసిద్ధ ఛాయా సోమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున నుంచే భక్తులు భారీగా తరలివచ్చి, ఆలయంలో 365 ఒత్తులతో దీపారాధన నిర్వహించారు.తర్వాత ఆలయ కోనేటిలో దీపాలను వదిలి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా దీపాల కాంతులతో మిలమిలలాడగా, భక్తుల హర్షోల్లాసాలతో వాతావరణం మార్మోగింది.

కార్తీక పౌర్ణమి సందర్భంగా వైభవంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో నల్గొండతో పాటు ఉమ్మడి జిల్లా ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- నేరేడుచర్ల : కార్తీక పౌర్ణమి పుణ్యకాలంలో నేరేడుచర్ల శివాలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుండే మహిళా భక్తులు శివాలయాలకు తరలివచ్చి దీపకాంతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ సోమప్ప సోమేశ్వరాలయం, పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు, నేరేడుచర్ల సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్‌లు కుటుంబ సమేతంగా సోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరు సత్యనారాయణ ప్రత్యేక పూజలు

నిర్వహించారు. శ్రీ సోమేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శాస్త్రి, శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు శివయ్య శాస్త్రి వేదమంత్రాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 10న సోమవారం ఉదయం 9:30 గంటలకు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, అదే రోజు సాయంత్రం 6:30 గంటలకు కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వరరావు, ప్రధాన పూజారి శివయ్య శాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మా శెట్టి సైదయ్య, లాయర్ రమణారెడ్డి, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, చిత్తనూరు రామకృష్ణ, నారద మోహన్ రెడ్డి, ఆరే కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుక

విశాలాంధ్ర గూడూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో భక్తులు, మహిళలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వేకువ

జామునే మహిళలు ఉసిరి, తులసి,మారేడు చెట్ల వద్ద దీపాలు వెలిగించడమే కాకుండా తులసి వ్రతాలను నోముకున్నారు. మండలంలోని పలు దేవాలయాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. సాయంకాలం లక్ష దీపోత్సవం వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కూడా జరుపుకున్నారు.చైర్మన్ ఏపూరి రవీందర్ రెడ్డి,పెసరి శివ, గాదె సాగర్, మాదాసు రమేష్, యుగేందర్, బుర్ర. రమేష్, శ్రీనివాస్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు భక్తులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు షీ టీమ్స్ : సీపీ

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా మౌనంగా ఉండొద్దని, నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్ పనిచేస్తున్నదని బుధవారం రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో షీటీమ్‌కు 69 అందిన మొత్తం ఫిర్యాదులు అందాయని వాటిపై చర్యలు తీసుకున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలో రెండు షీటీం బృందాలు పని చేస్తున్నాయని,షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్ , కాలేజీలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో,గుడ్ టచ్ బ్యాడ్ టచ్,ఆత్మహత్యలు, డ్రగ్స్ ,బాల్య వివాహాలు,వరకట్నం చట్టాలపై,నూతన మహిళా చట్టాలపై,డయాల్ 1100,టి సేఫ్ యాప్ మహిళ భద్రత,రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని,ఆన్లైన్,క్యూ ఆర్ కోడ్ వాట్సాప్ ద్వారా కూడా స్వీకరిస్తారని తెలిపారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన, మాట్లాడిన విద్యార్థినిలు, మహిళలు అత్యవసర పరిస్థితులలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి కాల్ చేసి, వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని ఆయన సూచించారు.

సింగరేణి స్థలం కబ్జాకు యత్నం

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక సూపర్ బజార్ చౌరస్తా దగ్గరలోని పట్టణానికి చెందిన ఒక కుల సంఘం వారు ఆలయం పేరిట మరొకసారి లక్షలు విలువ చేసే సింగరేణి స్థలాన్ని మెల్లిమెల్లిగా కాజేసే యత్నం చేస్తున్నారు. వినాయక మండపం పేరిట నవరాత్రులకు పర్మిషన్ తీసుకొని మరొక ఆలయం కట్టడం కోసం ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. పలుమార్లు సింగరేణి అధికారులు వచ్చి అడపాదడపా ఆ స్థలంలో సూచిక బోర్డు ఏర్పాటు చేసారు. నోటీసులు అంటించి స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసిన సింహద్వారానికి మాత్రం కంచె ఏర్పాటు చేయకుండా వదిలేశారని విమర్శలు ఉన్నాయి. సింగరేణి ఎస్టేట్ అధికారులు ఈ కుల సంఘానికి వత్తాసు పలుకుతున్నారని, పట్టణంలోని పేద మధ్యతరగతి వారు బతుకుదెరువు కోసం సింగరేణి స్థలంలో చిన్న డబ్బా పెట్టుకున్నా ఎలాంటి కనికరం లేకుండా నిర్మానుష్యంగా వాటిని తొలగిస్తున్నారు. సింగరేణి ఆస్తులను పరిరక్షించడంలో ఈ అధికారులు ఘోరంగా విఫలం అవుతున్నారని, రాజకీయ నాయకులు సైతం కుల సంఘాల ఓట్ల కోసం డబ్బున్న వారికే ప్రాధాన్యమిస్తూ, పేద ప్రజలను విస్మరిస్తూ వారికే మద్దతు పలుకుతున్నారని, ఇప్పటికైనా సింగరేణి అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి లక్షలు విలువ చేసే సింగరేణి స్థలాన్ని కబ్జాకు గురికాకుండా రక్షించాలని ఇలా చూసి చూడనట్టు వదిలేస్తే పట్టణంలో సింగరేణి స్థలం ఎక్కడ ఖాళీగా కనబడిన ఆ స్థలం కబ్జాలకు సహకరించిన

రైతులను మోసంచేస్తే ఊరుకోం : జోగురామన్న

విశాలాంధ్ర ప్రతినిధి, ఆదిలాబాద్: జిల్లాలో పత్తి పండించే రైతులకు తేమ పేరిట మోసం చేస్తే చూస్తూ ఊరుకోం అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జోగు రామన్న కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం బిఆర్ఎస్ నేతలు బీజేపీ ఎంపీ నగేష్ ఇంటినీ ముట్టడించడంతో పరిస్థితి ఉద్రిక్తతం గా మారింది. సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు పెడుతుందని దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేతిలో ప్ల కార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. ఎంపీ ఇంటిలోకి వెళ్ళేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు ఎవ్వరినీ లోనికి వెళ్ళకుండా భారీ పహారా చేపట్టారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో తేమ శాతం విషయంలో ఇబ్బందులు పెట్టడం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోళ్లలో ఆంక్షలు ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం ను డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఐతే పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో జోగు రామన్నను రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. దాదాపు రెండు గంటల పాటు ఈ ముట్టడి కార్యక్రమం జరిగింది. డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపి ఇంటికి ఎవ్వరినీ వెళ్లకుండా బారి బందోబస్తు ఏర్పాటు చేశారు.వారు అవుతారని పట్టణవాసులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: రాజు

విశాలాంధ్ర- (ఏదులాపురం మున్సిపాలిటీ) : జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, సమాజంలో అవినీతి వ్యతిరేకంగా, అక్రమాలకు వ్యతిరేకంగా రాసే హక్కు జర్నలిస్టులకు ఉందని ఆ హక్కును కాలరాసే హక్కు ఏ ఏ శక్తులకు లేదని సీపీఐ 30వ డివిజన్ సెక్రటరీ బియ్యాల రాజు అన్నారు. విలేకరులు వార్తలొస్తే వారి చేతులు కాళ్లు నరికేస్తామని కొంతమంది సంస్కారహీనులు మాట్లాడిన తీరును పలువురు మేధావులు, రాజకీయ పార్టీలు నాయకులుతో పాటు అధికారులు సైతం ఖండిస్తున్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్ నందు సిపిఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ నిరసనలో ఏఐవైఎఫ్ యువజన సంఘం 28,29,30వ డివిజన్ నాయకులు మిరియాల నరుణ్ తేజ్, అక్కినపల్లి దేవయ్య, పానమాకుల కృపాకర్, యువజన సంఘం సభ్యులు హనే, టేకుమట్ల ప్రభాకర్, బాబి, నాగేంద్రబాబు, సంపత్, సిపిఐ సోషల్ మీడియా ఇంచార్జ్ రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర తల్లాడ : ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ మేనేజర్ బృందం కల్లూరు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని కేటాయించిన మిల్లులు కూడా వారు తనకి చేశారు. జిల్లాలో మొత్తం 326కొనుగోలు కేంద్రాలకు గాను 321 కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వాటిలో ఐదు కేంద్రాల నుండి ఏ గ్రేడ్ ధాన్యం 203మెట్రిక్ టన్నులు సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు.

సంపాదకీయం

విద్వేషాలను ఓడించిన మమ్దానీ

అమెరికాలో అతి పెద్ద నగరం, ప్రపంచంలో గొప్ప నగరాల్లో ఒకటి అయిన న్యూయార్క్ మేయరుగా జొహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడమే కాక ఆయన డెమొక్రాట్ పార్టీలో సోషలిస్టు కావడం బ్రహ్మాండమైన పరిణామమే. మమ్దానీ భారతీయ సంతతి వాడు. ప్రసిద్ధ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు. మంగళవారం రాత్రి డెమొక్రాట్ పార్టీ నాయకులకు పండగ రోజు. అబిగెయిల్ స్పాంబెగర్ వర్జీనీయ రాష్ట్ర గవర్నర్‌గా ఎన్నికయ్యారు. న్యూ జెర్సీ గవర్నర్‌గా మైకీ షెరిల్ల్ మరో వేపు జాక్ చీట్టరెల్లీని ఓడించి విజయ బావుటా ఎగరేశారు. కాలిఫోర్నియాలో గవిన్ న్యూసం కూడా డెమొక్రాటిక్ పార్టీకి చెందిన వాడే. దానివల్ల కాలిఫోర్నియా నుంచి మరో అయిదుగురు డెమొక్రాట్లు చట్ట సభలో ఉంటారు. ఇవన్నీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు పెద్ద విఘాతమే. 34 ఏళ్ల సోషలిస్టు మమ్దానీ న్యూయార్క్ లాంటి మహా నగరానికి మేయర్ కావడం అన్నింటికన్నా పెద్ద పరిణామం. నిజానికి ఈ ఏడాది ఆరంభంలోనూ మమ్దానీ అంటే ఎవరికీ తెలియదు. గత యాభై ఏళ్లల్లో ఎన్నడూ లేనట్టుగా మమ్దానీ పది లక్షల కన్నా ఎక్కువ ఓట్లు సంపాదించాడు. మొత్తం ఓట్లలో ఆయనకు 50.04 శాతం ఓట్లు దక్కాయి. ఆయన గెలుపు అమెరికాలో అనేక సానుకూల పరిణామాలకు సంకేతం. ఓ సోషలిస్ట్ న్యూయార్క్ మేయర్ కావడం అంటే అమెరికాలో సోషలిస్టు భావాలకు ఆదరణ పెరగడానికి చిహ్నం. ఈ ప్రభావం దేశమంతా ఉంటుందంటున్నారు. ఈ కారణాలన్నీ చూస్తే మమ్దానీ విజయం చాలా ప్రత్యేకమైన విజయ గాథే. మేయర్ ఎన్నికల ప్రచారంలో మమ్దానీ పెద్ద పెద్ద వాగ్దానాలే చేశారు కనక ఆయన ఏలుబడి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా గమనించవలసిన అవసరం ఉంది. ఈ వాగ్దానాలన్నీ నెరవేర్చే శక్తి ఆయనకు ఉంటుందో లేదో చూడాలి. మమ్దానీ గెలుపు కేవలం అసాధారణం మాత్రమే కాదని అమెరికాలో వామపక్ష భావాలు ఉన్న వారు భావిస్తున్నారు. ఈ ప్రభావం దేశమంతటా ఉంటుందని ఆశిస్తున్నారు. మేయర్‌గా మమ్దానీ హయాంలో ప్రజాభద్రత సన్నగిల్లుతుందని న్యూయార్క్ మాజీ పోలీసు కమిషనర్ రే కెల్లీ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మమ్దానీ విజయం వెనక ఆయన భార్య రమా దువాజీ మద్దతు చాలా అపూర్వమైందని చెప్తున్నారు. ఆమె నవతరానికి ప్రతినిధి. ఆమె వయస్సు 28 ఏళ్లే. ఆమె మామూలుగా జనం దృష్టిలో పడడానికి అంగీకరించరు. కానీ మమ్దానీ విజయోత్సవ సభలో ఆమె పక్కనే ఉన్నారు. రమా దువాజీ సిరియాకు చెందిన అమెరికా పౌరురాలు. ఆమె 2021 లోనే అమెరికా వచ్చి మమ్దానీని పెళ్లి చేసుకున్నారు. మమ్దానీ ఎన్నికల ప్రచారంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రచారం ప్రారంభించినప్పటి నుంచి ఆమె మమ్దానీకి వెన్నంటే ఉన్నారు. డిజిటల్ వేదికల్లోనూ, సామాజిక మాధ్యమాలలోనూ మమ్దానీ పలుకుబడి పెంచడానికి ఆమె నిరంతరం కృషి చేశారు. ఆమె మమ్దానీకి చాలా దన్నుగా ఉన్నప్పటికీ బహిరంగ వేదికల మీద తన భర్త పక్కన కనిపించే వారు కాదు. ఆమె మంచి కళాకారిణి. తన కళద్వారా ఆమె పలస్తీనియన్ల దయనీయ స్థితికి అద్దంపట్టే వారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికలకు ముందు మమ్దానీ డెమొక్రాటిక్ అభ్యర్థిగా ఎంపిక అయ్యే క్రమంలో మాత్రం రమా దువాజీ వేదికల మీద కనిపించే వారు. రమ న్యూయార్క్‌లోని విసువల్ ఆర్ట్స్ సంస్థ నుంచి స్నాతకోత్తర పట్టా సంపాదించారు. ఆమె గీసిన చిత్రాలు న్యూయార్క్, వాషింగ్టన్ పోస్టు, బీబీసి, ఆపిల్ స్పోటిఫై లాంటి చోట్ల కనిపించేవి. లండన్‌లోని మాధ్యమల్లో ఆమె చిత్రాలు వెలువడ్డాయి. రాజకీయ ప్రతిఘటనే ఆమె కళా రీతికి ఆలవాలం.

మమ్దానీ గెలుపు అమెరికాలో పురోగమన భావాలు విస్తరించ డానికి తార్కాణం. ఆయన గెలుపు వలస వాదులకు వ్యతిరేకంగా డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించడానికి చిహ్నం కూడా. మమ్దానీ గెలుపు ట్రంప్ ముస్లిం వ్యతిరేకతను ఎండగట్టడానికి కూడా నిదర్శనం. మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నిక కావడం ఒక్కటే మహత్తరమైంది కాదు. సిన్‌సినాటి నగర మేయర్‌గా ఆఫ్తాబ్ పర్వాల్ ఎన్నికయ్యారు. ఆయన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ సోదరుడు. జేడీవాన్స్ భార్య భారతీయ సంతతికి చెందిన వారే. ఆమె త్వరలోనే క్రైస్తవ మతం స్వీకరిస్తారని జేడీవాన్స్ ఇటీవలే ప్రకటించారు. వాన్స్ భార్య హిందువు. అమెరికాలో నివాసం ఉండాలంటే విధిగా క్రైస్తవం స్వీకరించవలసిన అగత్యం ఉందా అన్న ప్రశ్న తలెత్తక తప్పదు. వాన్స్ భార్య క్రైస్తవం స్వీకరిస్తారనడం మన దేశంలో లాగే అమెరికాలోనూ విద్వేషం ఇంకా వదలలేదనడానికే చిహ్నం. మమ్దానీ తండ్రి మహమూద్ మమ్దానీ ప్రఖ్యాత చరిత్రకారుడు. సలాం బాంబే చిత్ర దర్శకుడు. తాను ముస్లింను అని మమ్దానీ గర్వంగా చెప్పుకుంటారు. ఆయన పుట్టింది మాత్రం ఉగాండాలో. మమ్దానీ ముస్లిం కనక ఆయన న్యూయార్క్ మేయర్ కాకుండా చేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సహా చాలా మందే శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. ట్రంప్ అయితే మమ్దానీ న్యూయార్క్ మేయర్ అయితే ఆ నగరానికి నిధులు అందించబోమని బెదిరించారు. అక్కడికి ఆ నిధులు తన జేబులోంచి ఇస్తున్నట్టు. ఇలాంటి బెదిరింపులు మన దేశంలో ఎప్పటి నుంచో అనుభవంలో ఉన్నవే. ఎలాన్ మస్క్ సైతం మమ్దానీని తప్ప ఎవరినైనా ఎన్నుకోండి అని చెప్పి తన ముస్లిం వ్యతిరేకతను బయట పెట్టుకున్నారు. అన్నిటికన్నా మించి తీవ్రవాద దేశంగానే కాక అమెరికాకు లంకెలా తయారైన ఇస్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సైతం మమ్దానీ గెలవకుండా చూడడానికి సకల ప్రయత్నాలూ చేశారు. ఇది అమెరికా గడ్డ మీంచి "అబ్కి బార్ ట్రంప్ సర్కార్" అని మోదీ నినదించిన రోజులు గుర్తుకు వస్తాయి. మమ్దానీ విజయం అమెరికాలో ప్రబలుతున్న ఇస్లాం వ్యతిరేకతను ఓడించడంకన్నా ఎంత మాత్రం తక్కువ కాదు. ఇస్రాయెల్ యూదు దేశం. అనేక మంది యూదులు అమెరికా ప్రభుత్వంలో ఎప్పుడూ కీలక స్థానాల్లో పని చేస్తూనే ఉన్నారు. ముస్లిం వ్యతిరేకతను, యూదుల ఉన్మాదాన్ని వ్యతిరేకించడం మమ్దానీ విజయానికి సంకేతంగా పరిగణించాలి. భారతీయ సంతతి మూలాలు ఉన్న వ్యక్తి న్యూయార్క్ మేయర్ కావడం గర్వకారణమే. కానీ బృహన్ముంబై మేయర్ ఎన్నిక మూడున్నరేళ్ల నుంచి వాయిదా పడ్తూనే ఉంది. బెంగళూర్ మేయర్ ఎన్నిక జరగాల్సిన గడువు దాటి చాలా రోజులే అయింది. ఈ అంశాన్ని లేవనెత్తే వారే కనిపించడం లేదు. భారతీయ సంతతి వారు అమెరికాలో విజయ కేతనం ఎగరవేసిన వారిలో హరగోవింద్ ఖొరానా నుంచి చాలా మందే ఉన్నారు. సంతతి ఏది అన్న దానికన్నా వారి ఆలోచనా ధోరణి ఏమిటి అన్నదే ప్రధానం.

భారత నావికాదళానికి కొత్త శక్తి

దీజే మోహనరావు

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ నెల 2వ తేదీన, దేశీయంగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన లాంచ్ వెహికల్ మార్క్-3 రాకెట్ ద్వారా, భారత నావికాదళానికి చెందిన అత్యంత అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-7ఆర్ (సీఎంఎస్-03)ని విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. ఈ విజయం ఇస్రోకు గొప్ప సాంకేతిక మైలురాయి మాత్రమే కాదు, దేశ రక్షణ సామర్థ్యాలను ఇది గణనీయంగా పెంపొందించింది. అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించాలనే భారతదేశ లక్ష్యానికి ఇది తిరుగులేని నిదర్శనం. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సాయంత్రం 5.26 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన ఎల్వీఎం.3 రాకెట్‌కు 'బాహుబలి' అనే పేరు ఉంది. ఈ రాకెట్ సుమారు 4,400 కిలోల బరువున్న జీశాట్-7ఆర్ ఉపగ్రహాన్ని జియోసింక్రనస్ బదిలీ కక్ష్యలోకి (జీటీఓ) విజయవంతంగా చేర్చింది. భారత్ గడ్డపై నుంచి ప్రయోగించిన కమ్యూనికేషన్ ఉపగ్రహాల్లో ఇంత బరువైనది ఇదే మొదటిసారి. నిజానికి నాలుగు టన్నుల కంటే ఎక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి గతంలో విదేశీ సంస్థలపై ఆధారపడవలసి వచ్చేది. ఇప్పుడు ఎల్వీఎం3 విజయం ద్వారా ఆ సాంకేతిక అవరోధాన్ని ఇస్రో పూర్తిగా తొలగించింది.

ఈ మిషన్‌లో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాక, అంతకు మించిన ఒక ముఖ్యమైన సాంకేతిక ప్రయోగం కూడా జరిగింది. జీశాట్-7ఆర్ ఉప గ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత, ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్‌లోని సీ25 క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ఇంజిన్‌ను అంతరిక్షంలో మళ్లీ మండించి చూపారు. ఈ సామర్థ్యం రాకెట్ కార్యాచరణ సౌలభ్యాన్ని అసాధారణంగా పెంచుతుంది. భవిష్యత్తులో ఈ రాకెట్ ఒకేసారి అనేక ఉపగ్రహాలను వేర్వేరు కక్ష్యల్లోకి ఖచ్చితంగా చేర్చడానికి, గగన్‌యాన్ వంటి మానవ అంతరిక్ష యాత్రలకు అవసరమైన సంక్లిష్టమైన విన్యాసాలను నిర్వహించడానికి ఈ సాంకేతికత పునాదిగా నిలుస్తుంది. జీశాట్-7ఆర్ ఉపగ్రహం భారత నావికాదళానికి ఒక వ్యూహాత్మక వరం. ఇది 2013 నుంచి సేవలందిస్తున్న పాత జీశాట్-7 (రుక్మిణి) ఉపగ్రహం స్థానాన్ని భర్తీ చేస్తుంది. పూర్తిగా దేశీయంగా రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం, నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, తీర ప్రాంత కమాండ్ కేంద్రాల మధ్య నిరంతరాయంగా, సురక్షితమైన కమ్యూనికేషన్ అనుసంధానాన్ని అందిస్తుంది. ఇది వాయిస్, డేటా, రియల్-టైమ్ వీడియోలను సైతం అత్యధిక వేగంతో పంపగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

శత్రు దేశాల నుంచి వచ్చే ఎలక్ట్రానిక్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జీశాట్-7ఆర్ అత్యాధునిక రక్షణ లక్షణాలను కలిగి ఉంది. ఇందులో ప్రధానంగా జామింగ్‌ను నిరోధించే సామర్థ్యాలు, ఫ్రీక్వెన్సీ హోపింగ్ సాంకేతికత ఉన్నాయి. ఈ ప్రత్యేకతలు యుద్ధ వాతావరణంలో సైతం నావికాదళ కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా, భద్రంగా ఉండేలా చూస్తాయి. ఈ ఉపగ్రహం యూహెచ్‌ఎఫ్, ఎస్‌సీకేయూ, కేఏ వంటి బహుళ-బ్యాండ్‌లలో పనిచేస్తుంది.

ఈ ఉపగ్రహం హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా పటిష్టమైన టెలికమ్యూనికేషన్ కవరేజీని అందిస్తుంది. ఈ కవరేజీ ఆగ్నేయాసియా వైపు, తూర్పు ఆఫ్రికా తీరం వైపు కూడా విస్తరించి, తీరం నుంచి 2,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న నావికాదళ ఆస్తులకు సైతం సేవలందిస్తుంది. జీశాట్-7ఆర్ అందించే ఈ మెరుగైన కమ్యూనికేషన్ అనుసంధానం ద్వారా, నావికాదళం యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, గగనతల నిఘా పరికరాలన్నింటినీ ఒకే నెట్‌వర్క్‌లోకి తీసుకురాగలదు. ఫలితంగా, నిజ సమయ పరిస్థితులపై అవగాహన పెరిగి వ్యూహాత్మకంగా కీలకమైన ఇండో-పసిఫిక్ జలాల్లో నావికాదళం సమన్వయంతో కూడిన కార్యకలాపాలను వేగంగా నిర్వహించడానికి వీలవుతుంది. అందుకే ఈ ఉపగ్రహాన్ని నావికాదళానికి శక్తి గుణకం అని వ్యవహరిస్తున్నారు.

రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సంక్లిష్టమైన భద్రతా సవాళ్ల మధ్య, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడాలనే భారత నావికాదళ సంకల్పాన్ని జీశాట్-7ఆర్ ప్రతిబింబిస్తోంది. ఈ ఉపగ్రహం పూర్తిగా దేశీయంగా తయారవ్వడం, దేశీయ రాకెట్ ద్వారా ప్రయోగించడం వలన, అత్యవసర సమయాల్లో విదేశీ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది భారత సార్వభౌమత్వానికి, భద్రతకు అత్యంత కీలకమైన అంశం.

8247045230

సమానత్వం ముట్టడిలో, ప్రజాస్వామ్యం ప్రమాదంలో



డి.రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

రష్యా విప్లవం 1917 లో మహత్తర విజయం సాధించింది. ఆనాడు రష్యా రాజకీయ చిత్రాన్ని అంత తేలికగా వూహించలేని పరిస్థితి. ఈ మహత్తర విప్లవం వివిధ ఖండాలలో విభ్రాంతి కలిగించే అలలను సృష్టించింది. శతాబ్దాలుగా వలసవాద రాజ్యాల పునాదులు కదిలిపోయాయి. ఆ కాలంలో మానవాళి విదేశీ పాలనలో లేదా సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలో నివసించింది. అప్పుడు స్వాతంత్ర్యం, విముక్తి, సమానత్వం కోసం పెట్రోగ్రాడ్ వీధుల్లో జరిగిన విప్లవ పోరాటానికి మించి ఈ విప్లవ పోరాటంలో పాల్గొనాలని గొప్ప పిలుపునివ్వడం జరిగింది. వలసవాద ప్రపంచం బలహీనమైన స్పర్శ నాడిని తాకింది. 1900 ప్రారంభ దశాబ్దిలలో ఐరోపా వలస పాలన 80 శాతం ప్రాంతంలో విస్తరించింది. వలస పాలన ఆధిపత్యం తెలియజేసేది ఏమిటంటే ప్రపంచ జనాభాలో అత్యధికులు అణచివేతకు బలవంతంగా లోనైన ప్రాంతంలో జీవిస్తున్నారు. ఆఫ్రికా, కరేబియన్ ప్రాంతాల అంతటా అనేక మిలియన్ల ప్రజలు బానిసత్వంలో ఉన్నారు. ఆ కాలంలో రష్యా విప్లవం భూకంపం వలే ప్రపంచాన్ని వణికించింది. ప్రాచీన పాలన తల్లకిందులైంది. అంతేకాదు అణగారిన వర్గాల ప్రజలకు గొప్ప ఆశాభావనను కల్పించాయి. ఇదే సమయంలో విప్లవం లోతైన ప్రతిధ్వని ఇచ్చింది. అంతేకాదు విదేశీ పాలనకే గాక, వారసత్వంగా వస్తున్న నిర్మాణాలు కేవలం వలసవాద ప్రాంతాలలో పెరుగుతున్నాయి. ఇండియాలో అనేక దశాబ్దాల పాటు బ్రిటీషు పాలనలో ఉండటం కేవలం ఆర్థిక దోపిడీ కోసం మాత్రమే కాదు, మానవ శ్రమను దోచుకున్నారు. పురుషాధిపత్య వ్యవస్థలో కులం, మతం మధ్య తీవ్ర ఘర్షణలను బ్రిటీషు పాలకులు సృష్టించి, పెంచారు.

వలస పాలన చేస్తున్న విదేశీ పాలకులపై ఇండియా ప్రజల గుండెల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. కులం అణచివేత, వివక్ష, హింస దేశంలో కొనసాగింది. మన రిపబ్లిక్‌లో ఇదొక మచ్చలాగా ఉండిపోయింది. 2023 నివేదిక ప్రకారం, జాతీయ నేరాల నమోదు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) వెల్లడించిన మేరకు 2023లోనే 57,789 మంది షెడ్యూల్డు కులాల (ఎస్సీలు) ప్రజలు నేరాలు చేశారని కేసులు నమోదు చేశారు. ఎస్సీలపై నేరస్థులుగా పరిగణించి ప్రతి సంవత్సరం నేరస్థ కేసులు నమోదు చేస్తున్నారు. ఎస్టీలపై 2022లో 28.8 శాతం మందిపై నేరాలు మోపి కేసులు నమోదు చేయగా, 2023లో 12,960 మందిపై కేసులు నమోదు చేశారు. ఎస్సీలు, ఎస్టీలపై అణచివేతలు పెరుగుతున్నాయి. మన



సమాజంలో వలస పాలన ముందుగానే ముగిసిపోవలసింది. అయితే అణచివేత, అంటరానితనం, కుల వివక్ష, హింస కొనసాగడం వల్ల దేశ విముక్తి ఆలస్యమైంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్‌గవాయ్‌పై లాయరు బూటు విసరడం ఎందుకు? న్యాయమూర్తి దళితుడు గనుకనే ఇది జరిగింది. సనాతన ధర్మాన్ని పాటించాలని లాయరు అన్నారు. మితవాద ఫాసిస్టు శక్తులు ఇలాంటి తుచ్ఛమైన చర్యలకు పూనుకుంటున్నారు.

గిరిజనుల హక్కులను హరించారు. వారికి చెందిన వనరులను కార్పొరేట్లు దోచుకొని అపారమైన లాభాలు పొందుతున్నారు. వలస పాలన రోజుల్లో ఇదే పరిస్థితి. ఆదివాసీల భూములను ఆక్రమించుకొని వారికి విముక్తి లేకుండా చేశారు. వారి భూములను ఆక్రమించుకొని అడవులను నాశనం చేశారు. ఇలాంటి ఘటనలు ఎక్కడో ఒకచోట జరగలేదు. హింసాయుత ఘటనలు ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయి. అడవులు ఏ పంటలు లేని ఖాళీ భూములుగా తయారయ్యాయి. అణగారిన వర్గ ప్రజలను ఎక్కువగా అణచివేస్తున్నారు. అణచివేత ఒక విధానం ప్రకారం జరుగుతోంది. ఈ దుర్మార్గాలను ప్రశ్నించిన వారిని నక్సలైట్లు, మావోయిస్టులని ముద్ర వేసి కార్పొరేట్ల అభివృద్ధికి పాలకులు నిత్యం తోడ్పడుతున్నారు. మహిళలకు వ్యతిరేకంగా హింసను ప్రోత్సహిస్తున్నారు. పితృస్వామిక సమాజంలో మహిళలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. సంప్రదాయాలు సాంస్కృతిక మితవాద భావజాలాన్ని ప్రచారం చేస్తూ అసమానతలను పెంచుతున్నారు. 2023 లో 4.48 లక్షల నేరాలను మహిళలు చేశారని వారిపై నేరాల మోపి కేసులు బనాయిస్తున్నారు. ప్రపంచంలో సగం మానవాళి పూర్తి పౌరసత్వానికి, స్వతంత్రతకు పోరాడుతున్నారు. న్యాయం సమానత్వం సంఘీభావం కంటే మతానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. భారతదేశంలో ప్రజలందరికీ సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని కల్పిస్తూ రాజ్యాంగాన్ని రచించారు. అయితే నేడు ఆ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘపరివార్, బీజేపీ రాజ్యాంగానికి విలువ ఇవ్వటం లేదు. ఈ అణచివేత సంస్థలో ఏమాత్రం అంగీకరించడం లేదు. ఫాసిస్టు మత శక్తులకు ఫాసిస్టు ఎజెండా బలంగా ఉంది. మైనారిటీలకు రక్షణ లేదు. ప్రజాస్వామ్యాన్ని మత శక్తుల గుప్పిట పెట్టుకున్నాయి. ఇది సమాజానికి, దేశానికి అత్యంత ప్రమాదకరం. సామాజిక వివక్ష అన్ని వర్గాలకు, కులాలకు, మతాలకు కొనసాగుతున్నది. అత్యధిక వర్గాలకు ఆర్థిక వృద్ధి బోలుగా ఉన్న ప్రచారమే. ప్రజాస్వామ్యం అనేది అణగారిన వర్గాలు సమాన హక్కులను పొందడం లేదు. ఈ నేపథ్యంలో హక్కులను హరించే శక్తులను ప్రతిఘటించి ఐక్యంగా ఓడించాలి. రష్యా విప్లవం విజయవంతం కావడం కేవలం ఒక దేశానికి పరిమితమైంది కాదు. ఆ దేశంలో సమానత్వం హక్కు అయింది. రష్యా విప్లవం చరిత్రాత్మక పాఠం అయింది. భారత కమ్యూనిస్టు పార్టీ దేశ వ్యాప్తంగా నిరసనలకు,ప్రజలందరినీ నవంబర్ 18 న ప్రజా సమీకరణకు, సామాజిక న్యాయం , సమానత్వం సాధనకు పూనుకోవాలని పిలుపునిచ్చింది. మైనారిటీలను. అణగారిన వర్గాల ప్రజలను లక్ష్యంగా పెట్టుకుని మహిళలపై హింసకు పూనుకుంటున్నారు. పౌరులందరు కులం, వర్గం, మతంతో నిమిత్తం లేకుండా అందరికీ గౌరవం, హక్కులు ఉండాలి. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని కాపాడుకోవాలి. ఫాసిజాన్ని అంతం చేయాలి. విప్లవం ఎల్లవేళలా కొనసాగాలి.

బీహార్ భవిత ఎటు...!

పతకమూరు దామోదర ప్రసాద్

బీహార్ 18వ శాసనసభ 234 స్థానాలకు రెండువిడతలుగా జరుగుతున్న ఎన్నికలలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ నాయకత్వంలోని అధికార ఎన్డీఏ, రాహుల్, ఆర్జేడి నేత తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని మహాగట్బంధన్ హోరాహోరీగా తలడుతున్నాయి. నవంబర్ 6న తొలివిడతలో 121 స్థానాల ఎన్నికలకు సర్వం సిద్ధంకాగా, మలివిడత 122 స్థానాలకు ఈ నెల11న ఎన్నికలు జరుగనున్నాయి. గత 20 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్ సారధ్యంలోనే ప్రస్తుతానికి ఎన్డీయే ఎన్నికలకు వెళుతుండగా, ప్రదాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభృతులు బీహార్ అంతటా కలియదిరిగి మహాగట్బంధన్‌కు ఓటేస్తే 1990 నుంచి 1995 వరుకు సాగిన లాలూ, రబ్రీదేవి నాటి ఆటవిక పాలన, నేరాలు, ఘోరాలు మళ్లీ వస్తాయని, బీహార్ అంధ యుగాలలోకి వెళుతుందని, డబుల్ ఇంజిన్ సర్కార్ లాభాలు, సుపరిపాలన కావాలంటే మళ్లీ నితీశ్ నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ, ఆర్జేడీ, ఎల్జేపి, హిందూస్తాన్ ఆవామీ మోర్చా, లోక్‌సమతా పార్టీ పంచపాండవుల వలే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాయని హామీ ఇచ్చారు. కాగా రాహుల్, తేజస్వి నేతృత్వంలోని ప్రతిపక్ష మహాగట్బంధన్ కూడా ఈసారి ఎలాగయినా ఎన్డీయేను చిత్తుచేసి, బీహార్‌ను చేజిక్కించుకోవాలని సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి.

నితీశ్ వయోభారం, అనారోగ్యం వల్ల పాలన చేసే స్థితి లేదని, నేరాలు పెరుగుతున్నాయని, అందరి భాగస్వామ్యంతో బీహార్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలంటే యువకుడైన తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని మహాగట్బంధన్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. లాలు తొలిసారి ముఖ్యమంత్రి అయిన 1990 లో తేజస్వి పురిటి పొత్తిళ్లలోని నాలుగు నెలల పసికందుని, ఢిల్లీలో 9వ తరగతితో చదువుకు స్వస్తిచెప్పిన తేజస్వి 2020 ఎన్నికలలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి యువతను ఆకర్షించినా మహాగట్బంధన్ 110 స్థానాలకు పరిమితమైంది. ఆర్జేడీ 75 స్థానాలు గెలిచి పెద్దపార్టీగా నిలిచింది. మజ్లిస్ పార్టీ వేరుగా పోటీచేసి 6 స్థానాలు గెలిచి అనేక చోట్ల మహాగట్బంధన్ విజయావకాశాలు దెబ్బతీసింది. ఈ ఎన్నికలలో కూడా 30 స్థానాలకు పోటీకి దిగింది. ఇక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఇప్పటికే రాష్ట్రమంతా చుట్టేశారు. తానుపోటీ చేయకుండా జన్ సురాజ్ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపారు. ఒక్కసీటు గెలిచే వీలున్నా బహుముఖ పోటీల్లో ప్రధాన పార్టీల విజయావకాశాలు దెబ్బతీయగలరని అంటున్నారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 2005 నుంచి మహిళా సంక్షేమానికి, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ, పంచాయతీరాజ్, పురపాలక సంఘాల అధ్యక్ష స్థానాలలో రిజర్వేషన్లు కల్పించి వారి మన్ననలు చూరగొన్నారు. మహా దళితులకు, 36 శాతం ఉన్న అత్యంత వెనుకబడిన(ఈబీసీ) వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి 15శాతం ఓటు బ్యాంకును స్థిరపరచుకున్నారు. బీజేపీకి అగ్రవర్ణాలు తదితరులతో కలిసి దాదాపు 20శాతం ఓట్లున్నాయి. వీరికి తోడు హిందూస్తాన్ ఆవామీ మోర్చా దళిత ఓట్లు, లోక్ సమతా పార్టీ ఓట్లతో కలిపి దాదాపు 38 శాతం ఓట్లున్నాయి. మహాగట్బంధన్‌కు బలమైన యాదవ, ముస్లిం(14శాతం,17శాతం) 32 శాతం ఓట్లున్నాయి. అయితే అధికారానికి ఈ ఓట్లు చాలవని గుర్తించి తేజస్వీ యాదవ్ ఈ ఎన్నికల ముందు ఎన్డీయేను వీడిన వీఐపీ నేత ముఖేశ్ సహానీకి ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తామని

ప్రకటించి ప్రచార సభలకు వెంట బెట్టుకు వెళుతున్నారు. ఓటర్లలో 4.5 శాతం మత్స్యకారులున్నారు. వారిలో మళ్లీ ఉపకులానికి 2.6 శాతం ఓట్లున్నాయి.

గత ఎన్నికల్లో మరో 12 స్థానాలు గెలిచి ఉంటే తేజస్వీకి ముఖ్యమంత్రి పీఠందక్కేది. సీమాంచల్‌లో మజ్లీస్ పార్టీ మహాగట్బంధన్‌ను దెబ్బతీసింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మహాగట్బంధన్‌కు 37.23 శాతం ఓట్లు రాగా, ఎన్డీఏకు 37.26 శాతం అంటే కేవలం 12,700 ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. బీహార్‌లో దాదాపు 20 శాతం దళితులున్నారు. మహా దళితులు, చిరాగ్ పాశ్వాన్ ఎన్డీయేకు మద్దతుగా ఉన్నారు. ఎన్నికలకు ముందే ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన కింద దాదాపు కోటిన్నర మంది మహిళలు ఒక్కొక్కరి ఖాతాలో రూ20 వేలు జమచేసి, మెరుగైన ప్రతిభ కనబరచిన వారికి రూ2 లక్షల వరకు రుణాలిస్తామని నితీశ్ ప్రభుత్వం వారిని బట్టలో వేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. మహిళల ప్రాధాన్యత గుర్తించిన తేజస్వీ మహాగట్బంధన్ అధికారంలోకి వస్తే ఒక్కో మహిళ ఖాతాలో నెలనెలా రూ2500 జమచేస్తామని, సంక్రాంతి పండుగకు రూ30 వేలిస్తామని, ఇంటికో ఉద్యోగం ఖచ్చితంగా ఇస్తామని పోటీ హామీలిచ్చి అధికార కూటమిలో గుబులు రేపారు. అత్యంత వెనకబడిన వర్గాలలోని 112 ఉపకులాల వారు 120 నియోజకవర్గాల ఫలితాలను ప్రభావితం చేయనున్నారు. 10వేలకంటే తక్కువ మెజారిటీతో పార్టీలు గెలిచిన స్థానాలు 50. హిల్సా నియోజకర్గంలో ఆర్జేడి అభ్యర్థిపై జేడీయూ అభ్యర్థి కేవలం 12 ఓట్లతో గెలిచారు. బర్బిగా స్థానంలో విజేత మెజార్టీ 113. 10 స్థానాలలో అభ్యర్థులు వెయ్యి ఓట్లలోపు మెజారిటీతో గెలిచారు. రాహుల్ ఓట్ చోరీ యాత్ర చేసినా 47లక్షల మంది పేర్లు తుది ఓటర్ల జాబితాలో చేరలేదు. వీరిలో 16 లక్షల మంది మహిళలు, ఈబీసీలు దళితులే. గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసి జేడీయూపై కత్తిగట్టిన చిరాగ్ పాశ్వాన్ ఎల్జేపీ ఈసారి అధికార కూటమిలో చేరగా, గతంలో ఎన్డీయేలో ఉన్న ముకేశ్ సహానీ ఈసారి మహాగట్బంధన్‌తో జట్టు కట్టి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కులాలు, ఉపకులాల ప్రాబల్యం, ఆ చైతన్యం ఎక్కువగా ఉన్న బీహార్‌లో పార్టీలు ఓట్ల కోసం అలవిగాని హామీలిచ్చాయి. ఇంటికో ఉద్యోగం ఇవ్వాలంటే మరో కోటికి పైగా ఉద్యోగాల కల్పనకు రూ6లక్షల కోట్లు అవసర మంటున్నారు. ఇంటికి 200యూనిట్ల విద్యుత్‌కు భారీగా నిధులు కావాలి. యువత, మహిళలను అకట్టుకుని అధికారంలోకి రావాలని యువకు డైన తేజస్వీ ప్రయత్నిస్తున్నారు. ఈ ఎన్నికలలో మళ్లీ గెలిచి ఉత్తరాదిలో సత్తాచాటాలని మోదీ యత్నం. తేజస్వి తేజస్సు వెలుగుతుందా లేక మోదీ, నితీశ్ ప్రభావం కొనసాగుతుందా అనేది 7.45కోట్ల బీహార్ ఓటర్లు తేల్చనున్నారు.

సీనియర్ జర్నలిస్టు,
సెల్: 9440990381

కబడ్డీ ఆటగాడి కాల్చివేత

బిష్ణోయ్ గ్యాంగ్ ఘాతుకం

లూధియానా: పంజాబ్‌లోని లుధియానాలో కబడ్డీ క్రీడాకారుడు దారుణ హత్యకు గురయ్యాడు. లుధియానా జిల్లాలోని సమ్రాలా బ్లాక్‌లో కబడ్డీ ఆటగాడు గుర్వీందర్ సింగ్‌ను దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అన్మోల్ బిష్ణోయ్ పేరిట సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. గుర్వీందర్ సింగ్‌ను తమ గ్యాంగ్‌కు చెందిన కరణ్, తేజ్ చక్ అనే వ్యక్తులు హత్య చేసినట్లు పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపుచర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా ఇటీవల కెనడాలో హత్యకు గురైన భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త దర్శన్‌సింగ్ సహాసిని తామే చంపినట్లు ఇటీవల బిష్ణోయ్ గ్యాంగ్ అంగీకరించింది. అతడు తమకు డబ్బులు ఇవ్వకపోవడంతో హత్య చేసినట్లు వెల్లడించింది. కెనడాలోని పంజాబీ గాయకుడు చాని నట్టన్ ఇంటి వెలుపల జరిగిన కాల్పులకు కూడా బాధ్యత తమేనని ప్రకటించింది. కాగా అక్టోబర్ 31న లూధియానాకు చెందిన 26 ఏళ్ల కబడ్డీ ఆటగాడు తేజ్‌పాల్ సింగ్ హత్యకు గురయ్యాడు. స్నేహితులతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వారితో గొడవ జరగడంతో తేజ్‌పాల్ స్నేహితులే అతడిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పంజాబ్‌లో వరుసగా జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్ టాయిలెట్‌లో రహస్య కెమెరాలు

రెండువేల మంది మహిళల ఆందోళన

బెంగళూరు: మహిళల వసతి గృహం టాయిలెట్‌లో రహస్య కెమెరాలు అమర్చిన ఘటన కలకలం సృష్టించింది. మంగళవారం రాత్రి ఒక టాయిలెట్‌లో వాటిని గుర్తించిన మహిళలు ఆందోళనకు దిగారు. తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. ఈ ప్రాంతం కర్నాటకకు సమీపంలో ఉంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఒక ప్రముఖ సంస్థ తమ ఉద్యోగుల కోసం వసతి గృహాన్ని నిర్వహిస్తోంది. అక్కడే ఉంటున్న ఒడిశాకు చెందిన ఒక మహిళా ఉద్యోగి ఈ కెమెరాలు అమర్చింది. రహస్యంగా వీడియోలు చిత్రీకరిస్తోంది. ఆ హాస్టల్‌లోనే ఉంటున్న మరో మహిళకు ఆమె కదలికలపై అనుమానం వచ్చింది. తన అనుమానాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లింది. వారు వెతకడంతో ఈ కెమెరాల గుట్టు బయటపడింది. ఈ విషయం బయటికి పొక్కడంతో తీవ్ర కలకలం రేగింది. అక్కడ వసతి పొందుతున్న సుమారు రెండువేల మంది మహిళలు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు.

వారంలో 50 మంది మృత్యువాత

దేశంలో వరుస ఘోర ప్రమాదాలు

న్యూఢిల్లీ: గతవారం భారతదేశం అనేక పెద్ద ప్రమాదాలను, ఘోర విషాదాలను చవిచూసింది. దేశవ్యాప్తంగా ఈ వారం రోజుల్లో దాదాపు 50 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరిగిన ఘోర ప్రమాదాలు ఎంతో మంది ప్రాణాలను బలిగొన్నాయి. రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, దేవాలయాల్లో తొక్కిసలాటలు ఈ ప్రమాదాలకు కారణాలుగా నిలిచాయి. నవంబర్ 1వ తేదీన కార్తీక మాస ఏకాదశి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఏకాదశికి తోడు శనివారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆ రోజు ఆలయానికి రెండు వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తే... ఏకంగా 15 వేల మందికి పైగా వచ్చారు. ఆ తొక్కిసలాటలో 9 మంది మరణించగా, 25 మందికి పైగా గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో అక్టోబర్ 24న జరిగిన స్లీపర్ బస్సు ప్రమాదంలో 19 మంది మరణించారు. నవంబర్ 3వ తేదీన రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం దేశం మొత్తాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. 72 మంది ప్రయాణికులతో వెళున్న ఆర్టీసీ బస్సును వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ సమీపంలో మంగళవారం (నవంబర్ 4) సాయంత్రం ఘోర రైలు ప్రమాదం జరిగింది. గెవ్రా రోడ్ నుంచి బిలాస్‌పూర్ వైపు వస్తున్న లోకల్ రైలు, గూడ్స్ రైలును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. 20 మందికి పైగా గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్ చునార్ జంక్షన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం (నవంబర్ 5) నదీ స్నానానికి వెళ్లేందుకు రైలు దిగిన కొందరు భక్తులు స్టేషన్ నుంచి బయటకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందగా... పలువురికి గాయాలయ్యాయి. నవంబర్ 3న రాజస్థాన్‌లోని జైపూర్‌లో అదుపుతప్పిన టిప్పర్ 30-40 వాహనాలను బలంగా ఢీకొట్టింది. ట్రక్కు డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల ఈ భారీ ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో 13 మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

బీహార్‌లో భూమిహార్‌ల పోరు

పట్నా: బీహార్‌లో గతంతో పోలిస్తే కొంతమేరకు భిన్నమైన రాజకీయ వాతావరణం నెలకొన్నది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అంగబలం, ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రంలో కీలకంగా ఉన్న భూమిహార్ సామాజిక వర్గంలో ఈ పోరు ఆసక్తిగా మారింది. మొకామా వంటి ప్రాంతాల్లో రాజకీయ వైరం కొనసాగుతుండగా... అనేక ప్రాంతాల్లో ఈ వర్గానికి చెందిన వారే ప్రత్యర్థులుగా ఉండటం ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో భూమిహార్‌లు కేవలం 2.9 శాతం ఉన్నప్పటికీ అన్ని పార్టీలూ ఈ సామాజిక వర్గానికి దగ్గరకావడానికి ప్రయత్నిస్తుంటాయి. వారి చారిత్రక నేపథ్యమే అందుకు కారణం. వీరివి భూస్వామ్య కుటుంబాలు. జమీందార్లుగా కొనసాగిన వీరిని... అగ్రవర్ణాలుగా పరిగణిస్తుంటారు. ఈ సామాజిక వర్గం నుంచి అనేక మంది విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ నేతలు ఉన్నత స్థాయికి ఎదిగారు. బీహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీ కృష్ణసింహ కూడా ఇదే వర్గానికి చెందిన వారు. భూమిహార్‌లు సాధారణంగా బీజేపీకి మద్దతుగా ఉంటారు. ఈసారి ఎన్డీయే ఈ సామాజిక వర్గానికి చెందిన దాదాపు 32 మందికి టికెట్లు ఇచ్చింది. కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాల సారథ్యంలోని 'మహాగట్బంధన్' 15 మందికి అవకాశం కల్పించింది. మొకామా, కెసువా, బార్బిఘా, బెగుసరాయ్, మటిహాని, బిక్రమ్, లఖిసరాయ్ సహా పలు నియోజకవర్గాల్లో ఈ వర్గం వారు ఒకరిపై ఒకరు తలపడుతున్నారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హాపై కాంగ్రెస్ అమరేష్ అనీష్‌ను బరిలో నిలిపింది. వారు లఖిసరాయ్ నుంచి పోటీ చేస్తున్నారు. బిక్రమ్ స్థానం నుంచి బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధార్థ్ సౌరభ్ పోటీలో ఉండగా... అనిల్ కుమార్‌ను కాంగ్రెస్ బరిలో దింపింది. సిద్ధార్థ్ సౌరభ్ గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా చేశారు. మొకామాకు చెందిన అనంత్ సింగ్, సురజ్‌భన్ సింగ్‌లకు దశాబ్దాల నేర చరిత్ర ఉంది. ఇద్దరూ భూమిహార్ వర్గానికి చెందినవారే. 1980 దశకంలో నేర సామ్రాజ్యంలో పాఠాలు నేర్చుకున్న ఇద్దరూ... రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. కేసులు, శిక్షలు, అనర్హత వేటుతో కొంతకాలం ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నవేళ... జన్ సురాజ్ మద్దతుదారు (దులార్ చంద్) హత్యకు గురికావడం కలకలం రేపింది. ఈ కేసులో జేడీయూ అభ్యర్థిగా ఉన్న అనంత్ సింగ్ అరెస్టుతో వీరి మధ్య వర్గపోరు మరోసారి బహిర్గతమైంది.

ఉద్యోగాల కోసం ఓటు వేయండి: అఖిలేశ్

నవాడా (బీహార్): బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీకి మద్దతుగా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ప్రచారం చేశారు. బీహార్‌లోని నవాడాలో బుధవారం జరిగిన బహిరంగ సభలో అఖిలేశ్ మాట్లాడుతూ 'బీహార్ ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలి. మీ ఓటు ఉద్యోగాల కోసం వేయాలి. కొత్తతరం తేజస్వికి మద్దతు ఇవ్వాలి' అని ప్రజలను కోరారు. బీజేపీ తరపున ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని, యోగి చెప్పినవి నమ్మవద్దని అఖిలేశ్ ప్రజలకు సూచించారు. యోగిని నమ్మవద్దు... ఆయన యోగిగా ఉన్నప్పటికీ అన్ని అబద్ధాలే చెబుతారు. ఒక శాతంగా ఉన్న సంపద ఇప్పుడు 62 శాతానికి పెరిగింది. రైతులకు డబ్బులు చెల్లించలేని, యువతకు ఉద్యోగాలు కల్పించలేని వారు ఓటు అడిగేందుకు ఇక్కడిక వస్తారా అని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. వారు యూపీలో ఓడిపోయారు. యూపీ ప్రజలు వారిని తిరస్కరించారు. మొదట అవధ్‌లో ఓడిపోయారు. ఇప్పుడు బీహార్‌లోని మగధ్‌లో కూడా ఓడిపోతారు. ఉపాధి, యువత సాధికారతలో సానుకూల పరివర్తన కోసం తేజస్వీ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని అఖిలేశ్ ఓటర్లను కోరారు.

కాలుష్య నియంత్రణకు సాయం చేస్తాం

భారత్‌కు చైనా హామీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. రెండు వారాలుగా గాలి నాణ్యత బాగా క్షీణించింది. అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 దాటిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) గణాంకాలు వెల్లడించాయి. ఈ సమయంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా ముందుకువచ్చింది. ఈ మేరకు భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'చైనా ఒకప్పుడు తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడింది. అలాంటి సమస్యను ఎదుర్కొంటున్నవారితో మా ప్రయాణాన్ని పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్ త్వరలో ఆ పరిస్థితి నుంచి బయటపడుతుందని విశ్వసిస్తున్నాం' అని యూజింగ్ పేర్కొన్నారు. పొగమంచుతో తీవ్రంగా ఇబ్బందిపడిన చైనా... గాలి నాణ్యతను మెరుగుపర్చుకొనే క్రమంలో గణనీయమైన విజయాలు సాధించింది. గతంలో చైనాలో కూడా రాజధాని బీజింగ్‌తో పాటు పలు నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించింది. ప్రభుత్వం వెంటనే మేల్కొని గట్టి నియంత్రణ చర్యలు తీసుకోవడంతో చైనా మహానగరాల్లో కాలుష్య మేఘాలు చెదిరిపోయాయి. చైనా గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో శుభ్రమైన గాలి వీస్తోంది. ఇండియా కూడా వాయు కాలుష్య నియంత్రణకు ఇదేస్థాయిలో కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

భారీ ఎన్నికల మోసం బహిర్గతం: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: భారతదేశంలోనే అతిపెద్ద ఎన్నికల మోసాన్ని రాహుల్ గాంధీ బయటపెట్టారని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. ఎన్నికల కమిషన్‌ను విమర్శిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలపై నిద్రలో ఉండే ఎన్నికల సంస్థ అకస్మాత్తుగా ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్లను తొలగించడంలో, నకిలీ ఓటర్లను జోడించడంలో చురుకుగా మారుతుందని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ బుధవారం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్టు పెట్టారు. ఓటర్ల జాబితా సవరణ వాస్తవానికి 'ఓట్ల దొంగతనం' అని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం హర్యానా అసెంబ్లీ ఎన్నికలు 'దొంగిలించబడ్డాయి' అని గాంధీ పేర్కొన్న తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మోదీ-షా మోడల్ స్పష్టంగా ఉంది: ప్రజా మద్దతు రానప్పుడు ఓటరు జాబితా మార్చండి' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఇది ఓటర్ల జాబితా సవరణ కాదని, ఇది ఓట్ల దొంగతనమని తెలిపారు.

టీవీకే-డీఎంకే మధ్యే పోటీ

అసెంబ్లీ ఎన్నికలపై నటుడు విజయ్

మహాబలిపురం (తమిళనాడు): రాష్ట్రంలోని అధికార డీఎంకేకు తమ పార్టీయే బలమైన ప్రత్యామ్నాయమని టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్ బుధవారం స్పష్టంచేశారు. వచ్చే ఏడాది ఎన్నికల యుద్ధం ఈ రెండు పార్టీల మధ్య మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఇక్కడ ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన పార్టీ ప్రత్యేక జనరల్ కౌన్సిల్ సమావేశంలో విజయ్ మాట్లాడారు. అధికార పార్టీ డీఎంకే, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై విమర్శలు గుప్పించారు. తొక్కిసలాట తర్వాత పరిస్థితిని ప్రస్తావిస్తూ పార్టీ ఎదుర్కొంటున్న అడ్డంకులు తాత్కాలికమేనని, వాటన్నింటినీ తాము బద్దలు కొడతామని అన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోరాటం డీఎంకే, టీవీకే మధ్యే ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. 'ఈ పోటీ మరింత బలపడబోతోంది. టీవీకే 100 శాతం విజయం సాధిస్తుంది' అని విజయ్ నొక్కి చెప్పారు. సెప్టెంబరు 27న జరిగిన కరూర్ తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన ఘటన గురించి ఆయన మాట్లాడుతూ ప్రియమైన వారి మరణం తర్వాత తనకు వర్ణించలేని వేదన అని అన్నారు. సుప్రీం కోర్టు సస్పెండ్ చేసినప్పటి నుంచి ఏక సభ్య కమిషన్ నియామకాన్ని తొందరపాటుగా ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఆ దురదృష్టకర రోజున జరిగిన సంఘటనల కాలక్రమాన్ని వివరించడానికి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు విలేకరుల సమావేశం ఏర్పాటుపై కూడా మరిన్ని ప్రశ్నలు తలెత్తాయన్నారు. 'మనం ఎదుర్కొంటున్న అడ్డంకులు తాత్కాలికమైనవి. దేవుడు, ప్రకృతి ప్రజల రూపంలో మనతో నిలబడి ఉన్నప్పుడు మనల్ని ఎవరు ఆపగలరు' అని ప్రశ్నించారు. సమావేశం ప్రారంభంలో 41 మంది మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకుముందు, పార్టీ జనరల్ కౌన్సిల్‌లో 12 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ కూటమిపై నిర్ణయం తీసుకోవడానికి నటుడు-రాజకీయ నాయకుడికి అధికారం ఇవ్వడం, ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం వంటివి వాటిలో ఉన్నాయి.

ఓట్ల చోరీతో ప్రభుత్వ ఏర్పాటుకు

ఎన్డీయే పన్నాగం

ప్రియాంకాగాంధీ విమర్శలు

బెట్టియా: బీహార్‌లో ఓట్ల చోరీకి పాల్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్డీయే కూటమి కుటిలయత్నం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పేరుతో బీహార్‌లో మహిళలు సహా 65 లక్షల మంది ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని విమర్శించారు. బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అందుకే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు పూర్తిగా ఓట్ల చోరీలో మునిగిపోయిందని ప్రియాంక ఆరోపించారు. బీహార్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వెస్ట్ చంపారన్ జిల్లాలో ఆమె బుధవారం ప్రచారం నిర్వహించారు. వాల్మీకి నగర్, చన్‌పాటియాల్లో ఏర్పాటు చేసిన బహిరంగసభల్లో ప్రసంగించారు. దేశంలో ప్రస్తుత ఎన్డీయే పాలన బ్రిటిష్ పాలనను తలపిస్తోందని ప్రియాంకాగాంధీ విమర్శించారు. ఎన్డీయే తీరు చూస్తుంటే భవిష్యత్తులో దేశంలో అసలు ఎన్నికలు జరుగుతాయో, జరగవోనని అనుమానంగా ఉందని ఆమె చెప్పారు. "నా సోదరుడు రాహుల్ ఈరోజు హర్యానాలో 'ఓట్ల దొంగతనం' గుట్టు విప్పాడు" అని ఆమె అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో విస్తృతంగా అక్రమాలు జరిగాయని రాహుల్ చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ... "ఎన్డీఏ ప్రతిదీ నాశనం చేస్తుంది... భవిష్యత్తులో ఎన్నికలు జరుగుతాయో లేదో తెలియదు... మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? వారిని అధికారం నుండి తరిమికొట్టండి" ప్రియాంక ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పిస్తూ... నేరాలు, అవినీతిని నియంత్రించడం, యువతకు విద్యను అందించడం కంటే ఆర్జేడీ నాయకుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ ఫోటో కాంగ్రెస్ పోస్టర్‌లో లేకపోవడం గురించి ఆయన ఎక్కువ ఆందోళన చెందుతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. రాజకీయ సభల్లో తనతో పాటు నితీశ్‌కుమార్‌ను ఆయన ఎందుకు ఉండనివ్వడం లేదని ప్రశ్నించారు. బీహార్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బీహార్ ప్రజలు రూ. 25 లక్షల వరకు ఉచిత చికిత్స పొందుతారని ఆమె చెప్పారు. 'పేద కుటుంబానికి కనీసం ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి మేము మా వంతు ప్రయత్నం చేస్తాము... వివిధ విభాగాలలో లక్షలాది ఖాళీలను భర్తీ చేస్తాము' అని ఆమె హామీ ఇచ్చారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వస్థలమైన గుజరాత్‌లో అనేక పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి కానీ బీహార్‌లో మాత్రం ఏమీ లేవని... అందుకే ఇక్కడి యువత ఇతర రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. భూమి, వనరులను కార్పొరేట్‌లకు అప్పగించేవారు పేదల కోసం ఎప్పటికీ పనిచేయరని ప్రియాంక దుయ్యబట్టారు.

రాహుల్ గాంధీకి ఆదిత్య మద్దతు

ముంబై: భారీ స్థాయిలో ఓటర్ల మోసం జరిగిందని, ఎన్నికల సంఘం (ఈసీ) ఓట్ల దొంగతనం ద్వారా రాష్ట్రాలను స్వాధీనం చేసుకోవడానికి బీజేపీకి సహాయపడిందంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు శివసేన (యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రే బుధవారం మద్దతు తెలిపారు. గాంధీ లేవనెత్తిన అంశం పార్టీ రాజకీయాల గురించి కాదని, 'ప్రతి భారతీయుడి ఓటు విలువ' గురించి అని ఠాక్రే అన్నారు. 'ఓట్ల దొంగతనం ద్వారా బీజేపీ రాష్ట్రాలను స్వాధీనం చేసుకోవడానికి సహాయపడే ఎన్నికల కమిషన్ మోసాన్ని రాహుల్ గాంధీ మరోసారి బయటపెట్టారు. మన ఎన్నికలు ఇకపై ఎలా స్వేచ్ఛగా, న్యాయంగా లేవని ప్రపంచం చూస్తోంది... రుజువుతో' అని తెలిపారు. రాజకీయ భావజాలంతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడు గాంధీ ప్రజెంటేషన్‌ను చూడాలని ఆయన అన్నారు. 'ఇది మీ ఓటు విలువ గురించి, ఎన్నికల కమిషన్ ఒక రాజకీయ పార్టీ జాబితాలో మోసపూరిత లేదా నకిలీ ఓటర్లు ఉన్నారని నిర్ధారించుకోవడానికి అనుమతిస్తున్నందు వల్ల అది సున్నాకి మారుతుంది' అని ఆయన ఆరోపించారు. సేన (యూబీటీ) గతంలో మహారాష్ట్రలో 'ఓటరు జాబితా తారుమారు' అంశాన్ని లేవనెత్తిందని ఠాక్రే అన్నారు. 'కొన్ని రోజుల క్రితం మేము వర్లి, మహారాష్ట్రలోని ఇతర నియోజకవర్గాలలో ఓటర్ల మోసాన్ని బహిర్గతం చేశాం. భారీ నిరసనలు నిర్వహించాం. కానీ ఎన్నికల కమిషన్ చర్య తీసుకోవడానికి నిరాకరించింది' అని తెలిపారు. 'ఈ పోరాటం భారతదేశం అంతటా స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కోసం' అని ఠాక్రే చెప్పారు.

జెన్‌జీని రెచ్చగొట్టే ప్రయత్నమా?

రాహుల్ ఓటు దొంగతనం వాదనను తోసిపుచ్చిన బీజేపీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు దొంగతనం జరిగిందంటూ చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి, బీజేపీ నాయకుడు కిరెన్ రిజిజు బుధవారం తోసిపుచ్చారు. ఆయన తన నిరాధారమైన కథనాలతో 'జెన్ జీ'ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారా అని ప్రశ్నించారు. హర్యానా ఓటరు జాబితాలో బ్రెజిల్ మోడల్ పేరు ఉన్నట్లు రాహుల్ ప్రస్తావించిన తర్వాత రిజిజు స్పందించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో రిజిజు మాట్లాడుతూ 'రాహుల్ గాంధీ తన వైఫల్యాలను దాచడానికి విలేకరులను ఉద్దేశించి ప్రసంగించారు. బీహార్‌లో (రేపు) పోలింగ్ ఉంటుంది. అయితే అతను హర్యానా గురించి కథలను పంచుకుంటున్నాడు. బీహార్‌లో కాంగ్రెస్‌కు ఏమీ మిగిలి లేదని, అందుకే దృష్టిని మరల్చడానికి అతను హర్యానా సమస్యను లేవనెత్తుతున్నాడని ఇది చూపిస్తుంది' అని తెలిపారు. రాహుల్ గాంధీ బ్రెజిలియన్ మహిళా ఓటరు వాదనపై రిజిజు మాట్లాడుతూ 'ఎన్నికల సమయంలో ఆయన (గాంధీ) విదేశాలకు వెళతారు. పార్లమెంటు సమావేశాల సమయంలో ఆయన కంబోడియా, థాయిలాండ్ వంటి ప్రదేశాలను రహస్యంగా సందర్శిస్తారు. ఇప్పుడు బీహార్ ఎన్నికల సమయంలో ఆయన కొలంబియాకు వెళ్లారు. ఆయన విదేశాలకు వెళ్లినప్పుడు ఆయన కొన్ని ఆలోచనలను తిరిగి తీసుకువస్తారు. వాటిని తన బృందానికి అందిస్తారు. వారు ఈ నిరాధారమైన కథనాలను సిద్ధం చేస్తారు. అందరి సమయాన్ని వృథా చేస్తారు. రాజకీయ నాయకులు తీవ్రమైన సమస్యల గురించి మాట్లాడాలి. అలాంటి వ్యర్థమైన విషయాలలో మునిగిపోకూడదు' అని తెలిపారు. కాగా రాహుల్ గాంధీ 'భారతదేశ యువత, జెన్ జీ ఓటు దొంగతనం గురించి తెలుసుకోవాలని, ముందుకు వచ్చి 'సత్యం, అహింస' ద్వారా విషయాలను చక్కదిద్దాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రిజిజు స్పందిస్తూ, 'జెన్ జీని రెచ్చగొట్టడానికి ఆయన ప్రయత్నిస్తున్నారా? మన దేశ ప్రజలు తెలివైనవారు. మొత్తం కొత్త తరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అండగా నిలుస్తుంది. దీని నుంచి దృష్టిని మళ్లించడానికి, రాహుల్ గాంధీ నాటకాలు ఆడుతున్నారు. మన దేశాన్ని కించపరచడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ భారతదేశంలో అలాంటి కుట్రలు ఎప్పటికీ విజయం సాధించవు' అని అన్నారు.

చరిత్ర సృష్టించిన మీరా నాయర్ తనయుడు

న్యూఢిల్లీ: అమెరికాలోని న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్దానీ విజయం సాధించి... చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ జొహ్రాన్ మేయర్ కుర్చీ గెలుచుకున్నారు. ఈ పదవి దక్కించుకున్న తొలి భారత-అమెరికన్ ముస్లిం జొహ్రాన్. భారతీయ మూలాలున్న మందానీ... బాలీవుడ్ ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు. జొహ్రాన్ మమ్దానీ 1991 అక్టోబరులో ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ భారత మూలాలున్న వ్యక్తులు. తల్లి మీరా నాయర్ పంజాబీ హిందూ మహిళ. భారత దిగ్గజ దర్శకుల్లో ఆమె ఒకరు. 'సలామ్ బాంబే', 'మాన్‌సూన్ వెడ్డింగ్' వంటి ప్రముఖ చిత్రాలతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. తండ్రి మహ్మద్ మమ్దానీ గుజరాతీ ముస్లిం. బాంబేలో జన్మించిన మహ్మద్ మమ్దానీ... ఆ తర్వాత ఉగాండా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఆయన విద్యావేత్త. జొహ్రాన్ మమ్దానీకి ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు మారింది. ఆ తర్వాత రెండేళ్లకే న్యూయార్క్‌కు మకాం మార్చి అక్కడే స్థిరపడింది. సైన్స్, ఆఫ్రికన్ స్టడీస్‌లో జొహ్రాన్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు.

జొహ్రాన్ రాజకీయ విజయాల వెనుక తల్లిదండ్రుల పాత్రే ఎక్కువ. ముఖ్యంగా తల్లి మీరా నాయర్ జీవితం నుంచే ఆయన ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. నాలుగు దశాబ్దాల తన సుదీర్ఘ ప్రయాణంలో ఆమె ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. సంప్రదాయవాద, మూస సిద్ధాంతాలను సవాల్ చేస్తూ ముందుకుసాగారు. తన జీవిత అనుభవాలను ఒక్కగానొక్క కొడుకు జొహ్రాన్‌కు పాఠాలుగా చెప్పారు. 'మన కథలను తర్వాతి తరానికి మనం చెప్పకపోతే ఇంకెవరు చెబుతారు' అనేది ఆమె సిద్ధాంతం. ఆమె చెప్పిన కథలే జొహ్రాన్ రాజకీయ ప్రయాణానికి మూలస్తంభాలుగా నిలిచాయి. అణచివేతకు గళమెత్తాల్సిందే అనే నినాదంతో జొహ్రాన్ రాజకీయాల్లోకి వచ్చారు. 2020లో తొలిసారి న్యూయార్క్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇప్పుడు న్యూయార్క్ నగర మేయర్‌గా విజయం సాధించి మరో చరిత్ర సృష్టించారు.

మరోవైపు, మమ్దానీ విజయం అధ్యక్షుడు ట్రంప్ పాలనకు గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఎన్నికల్లో ఆయనను అడ్డుకునేందుకు రిపబ్లికన్ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. రిపబ్లికన్ల విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే మమ్దానీ... తన ప్రచారంలో పదునైన విమర్శలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. దీంతో ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. మమ్దానీ ఎన్నికల్లో గెలిస్తే న్యూయార్క్ సిటీకి ఫెడరల్ సాయం అందదని ట్రంప్ బెదిరించారు. యూదు వ్యతిరేకి అంటూ రిపబ్లికన్లు ఆయనపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వాటన్నింటికి ఎదురొడ్డి నిలిచిన మమ్దానీ... ఓటర్ల దృష్టిని ఆకర్షించడం పైనే ప్రధానంగా దృష్టిపెట్టారు. ఉచితాలు, హామీలతో ప్రచారం చేశారు. జొహ్రాన్ తల్లి మీరా నాయర్ భారత్‌లో సూపర్ డూపర్ డైరెక్టర్. 1988లో 'సలామ్ బాంబే' సినిమాతో దర్శకత్వంలో అడుగుపెట్టారు. మురికివాడల్లో చిన్నారులు, బాల కార్మికుల జీవితాలకు అద్దం పట్టిన ఆ సినిమా అంతర్జాతీయంగా గుర్తింపు సాధించింది. ఆస్కార్ అకాడమీ అవార్డులు, బాఫ్టా, గోల్డెన్ గ్లోబ్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు నామినేట్ అయింది. 'మిస్సిస్సిపీ మసాలా', 'ది నేమ్‌సేక్', 'మాన్‌సూన్ వెడ్డింగ్' వంటి చిత్రాలు కూడా ఆమెకు మంచి పేరు తెచ్చాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర : ఎంపీ ఆర్.కృష్ణయ్య

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : రాష్ట్రంలో ఫీజు రియింబర్స్మెంట్ ఎత్తివేసే కుట్ర జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ పథకాన్ని తీసుకొచ్చారని ఆర్ కృష్ణయ్య గుర్తు చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఫీజు రియింబర్స్మెంట్ పథకం ద్వారా ఉన్నత చదువులు చదివి గొప్పస్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు విడుదల చేస్తున్న ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్ కనిపించడం లేదా అని ఆర్ కృష్ణయ్య ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయకుండా కాలయాపనకే ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం సమస్యను పక్కదారి పట్టించడానికి విజిలెన్స్ దాడులు చేపిస్తోందని కృష్ణయ్య ఆరోపించారు. ఫీజుల సమస్యలను చర్చించడానికి వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వైఖరి మార్చుకొని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటారని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు మణికంత, రాజు నేత, రాజేందర్, అనంతయ్య, మోడీ రాందేవ్, బాలయ్య, నికిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పరామర్శ

విశాలాంధ్ర-దుండిగల్: మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తండ్రి కీ.శే తన్నీరు సత్యనారాయణరావు ఇటీవలే పరమపదించిన నేపథ్యంలో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి హరీష్‌రావుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోష్ రెడ్డి, వీరేష్,ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్ రహదారి పై మరో ప్రమాదం

విశాలాంధ్ర - మొయినాబాద్: హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై మొయినాబాద్ సమీపంలో తాజ్ హెూటల్ వద్ద ఒక బెలెనో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి, అయితే ప్రాణాపాయం తప్పింది. కారు వెనుక భాగం దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కారును పక్కకు తొలగించారు. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: ఈ నెల 10, 11న రాజేంద్ర నగర్ యోజకవర్గంలోని కాటేదాన్‌లో జిల్లా నాల్గొవ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో సిఐటీయు ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల సిఐటీయు కన్వీనర్‌గా సిహెచ్ . ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. నాలుగవ మహాసభలను విజయవంతం కోరారు. అనంతరం నూతన కన్వీనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... సిఐటీయు కార్మికులకు ఏ సమస్య ఉన్న ఎర్రజెండా వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: జూబ్లీహిల్స్‌లో జరగనున్న ఉప ఎన్నికలలో కచ్చితంగా గెలవబోయేది బీఆర్ఎస్ పార్టీనే అని శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ కొమిరిశెట్టి సాయిబాబా ధీమా వ్యక్తం చేసారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా షేక్ పేట్ డివిజన్ షేక్‌పేట్ గ్రామంలోని వెటర్నరీ కాలనీలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు సురేందర్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా సాయిబాబా మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలో లేరు. వాళ్ళు ఇచ్చిన 420 హామీలను ప్రశ్నిస్తూ ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ మంత్రులను సైతం ప్రశ్నిస్తూ వెనక్కి పంపిస్తున్నారు. కచ్చితంగా ప్రజలు తమ ఓటుతో సమాధానం చెప్పి తీరుతారు.అడుగడుగునా జనాలు హారతులతో మా అభ్యర్థి ని స్వాగతం పలుకుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో తప్పకుండా ఎగురాబోయేది బిఆర్ఎస్ జెండా నే అన్నారు.

గుర్తింపు కార్డుతో ఓటు హక్కు : ఆర్ వి కర్ణన్

విశాలాంధ్ర, హైదరాబాద్ : నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితలో పేరుండి, ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ క్రింద చూపిన 12 ప్రత్యామ్నాయ ఫోటో ఐడిలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్ , జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఆధార్, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాల కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు,నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పిఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(RGI) జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలనీ జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా.... ఏ గుర్తింపు కార్డు ఉన్న ఓటు వేయవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్ , జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తెలిపారు. ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్ గుర్తింపు కార్డు కాదు. పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేసేందుకు మాత్రమే ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్ లను ఓటర్లకు పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్ గుర్తింపు కార్డు కాదు అని స్పష్టం చేశారు. ఓటు వేసే సమయంలో ఓటర్లు ఎపిక్ కార్డ్ కానీ, అది లేకుంటే ఈసీఐ సూచించిన 12 ప్రత్యామ్నాయ ఫోటో ఐడి కార్డులలో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకుని వస్తేనే ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న 97 మంది వృద్ధులు, దివ్యాంగులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం మధురానగర్ లో హెూం ఓటింగ్ ప్రక్రియను జీహెచ్ఎంసీ కమిషనర్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ మంగళవారం పరిశీలించారు. హెూం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం 103 మందిలో 97 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బీసీల అభివృద్ధికి కట్టుబడున్న కాంగ్రెస్ : స్పీకర్

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సంజామల మండలం పెరుసోముల లోని కంబగిరి స్వామి ఆలయంలో రామ్మోహన్ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కోయిలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు నాయక్, ఎస్సైలు మల్లికార్జున్ రెడ్డి, రమణయ్య, సంజామల తహసీల్దార్ అనిల్ కుమార్‌లు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు పూర్ణకుంభంతోపాటు మేళతాళాలతో స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య జరుగుతున్న హెూమ యాగ ల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. కంబగిరి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి జరిగిన అభిషేక ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవు న్నీ ప్రార్థించినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో వర్షాలు అధికమై, అకాల వర్షాలు రైతాంగానికి నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు. వర్షాలు తగ్గి రైతులకు మేలు జరగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వద్దె సుబ్బరాయుడు మర్యాదపూర్వకంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిశారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో బీసీల అభివృద్ధిపై చర్చించారు. తెలంగాణలో బీసీలను ఏబిసిడిలుగా వర్గీకరించి కులాల నిష్పత్తి ప్రకారం విద్యా, ఉద్యోగ ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించేలా ప్రభుత్వంతో చర్చలు జరపాలని స్పీకర్‌ను వద్దే సుబ్బరాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రహదారి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- గ్రామీణ లింకు రోడ్డు సైతం నిర్మించాలి
- లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తాం
- రోడ్లు రహదారుల ఉద్యమ వేదిక కన్వీనర్ షాపురం శ్రీకాంత్

విశాలాంధ్ర - మొయినాబాద్: హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి పనులను తక్షణమే చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రోడ్లు రహదారుల ఉద్యమ వేదిక కన్వీనర్ శాపురం శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అన్ని గ్రామాల ప్రజలతో కలిసి జాతీయ రహదారిపై మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్జగూడ బస్సు ప్రమాదం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అన్నారు. మండలం లోని అన్ని గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారు అయ్యాయని తక్షణమే రోడ్డు పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంతల రోడ్లపై ప్రతి రోజు ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందన్నారు. ప్రతీ రోజు ఈ రోడ్డుపై ఒక ఘటన జరుగుతున్న పాలకులు, అధికారులు, ప్రతిపక్ష పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా జాతీయ రహదారితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రహదారు లకు మరమ్మత్తులు , నూతన రోడ్లు వేయాలని కోరారు. లేనిపక్షంలో త్వరలో రోడ్లు రహదారుల ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి, ప్రభాకర్, రాజ మల్లేష్, మహేష్, పాండు, మహేందర్, మణికంత, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రంగలాల్ చెరువు పునరుద్ధరణ పనుల పరిశీలన

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్ రాంగుడాలో రంగలాల్ కుంట చెరువు సుందరికరణలో భాగంగా ప్రముఖ ప్రొడక్ట్ ,ప్లాట్ ఫామ్ ఇంజనీరింగ్ సేవల సంస్థ అయిన వర్చుసా కార్పొరేషన్ తన దాతృత్వ విభాగం, సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా వర్చుసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ భాగస్వామ్యంతో, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ద్వారా స్వచ్ఛందంగా చేపట్టిన సుందరికరణ, పునరుద్ధరణ పనులు పూర్తయిన సందర్భంగా చెరువును కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. అరెకపూడి గాంధీ మాట్లాడుతూ, "రంగలాల్ కుంట సరస్సు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుందన్నారు. రంగలాల్ చెరువుకు దశ దిశ మారిందని, ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేపట్టడం జరిగిందన్నారు. మురికి కూపంలాంటి చెరువు స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చేరువుగా తీర్చిదిద్దాడమే ధ్యేయంగా పని చేసి నిరూపించడం జరిగినది అని ,నేడు సుజల జలంతో అపురూప దృశ్యకావ్యంగా ఆవిష్కృతమైనది అని , చెరువు కట్ట చుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలిపారు. వర్చుసా ఫౌండేషన్ సేవలు అభినందనీయం అని, వర్చుసా హైదరాబాద్ క్యాంపస్ సమీపంలోని 3.5 ఎకరాల రంగలాల్ సరస్సును అభివృద్ధి చెందుతున్న పట్టణ పర్యావరణ వ్యవస్థగా తీర్చిదిద్దింది. చుట్టుపక్కల వారికి శుభ్రమైన, పచ్చదనంతో కూడిన వినోద ప్రదేశంగా మార్చింది. ఈ పునరుజ్జీవనం సుస్థిరమైన పర్యావరణ ప్రభావాన్ని సృష్టించడానికి, సమాజ శ్రేయస్సును మెరుగుపరచడాని కి వర్చుసా ఫౌండేషన్ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను నొక్కి చెబుతుంది. రెండున్నరేళ్లుగా జరిగిన సమగ్ర పునరుద్ధరణ కార్యక్రమం ఎండిపోయిన సరస్సును ఇప్పుడు ప్రకృతిని, సమాజ జీవితాన్ని నిలబెట్టగల ఆరోగ్య కరమైన నీటి వనరుగా మార్చిందని తెలిపారు. ఈ సందర్భంగా వర్చుసా కార్పొరేషన్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అమిత్ బజోరియా మాట్లాడుతూ, 'వర్చుసాలో', సుస్థిరత్వం అనేది కమ్యూనిటీలు, పర్యావరణానికి మనం ఎలా దోహదపడతామో మార్గనిర్దేశం చేసే ప్రధాన బాధ్యత. పురోగతి, ఉద్దేశ్యం కలిసి కదలగలవనే మా నమ్మకాన్ని రంగలాల్ కుంట సరస్సు పునరుద్ధరణ ప్రతిబింబిస్తుంది. ఒకప్పటి బంజరు స్థలం ఇప్పుడు జీవవైవిధ్యం, సమాజ శ్రేయస్సుకు మద్దతు ఇచ్చే అభివృద్ధి చెందు తున్న పర్యావరణ వ్యవస్థగా మారింది. సంస్థలు, పౌర సంస్థలు, ప్రజలు ఉమ్మడి ఉద్దేశ్యంతో పనిచేసినప్పుడు, ఆ మార్పు కనిపించేదిగా ఉంటుందని, శాశ్వతంగా, ప్రగాఢంగా నెరవేరుతుందని ఈ పరివర్తన చూపిస్తుంది. వర్చుసాకు సంబంధించి ఈ చొరవ సాంకేతికత, బాధ్యతతో అనుభవాలను మెరుగుపరచడం, అభివృద్ధి చెందు తున్న కమ్యూనిటీలను నిర్మించడానికి ఆవిష్కరణ, కరుణను ఒకచోట చేర్చడం అనే మా ఉద్దేశ్యాన్ని ప్రతిబింబి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మోహిత్ శర్మ, శ్రీనివాస్ సుబ్బారావు, రాహుల్ శర్మ, రేఖ శ్రీనివాసన్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీకాంత్ పాకాల మరియు నాయకులు సంజీవ రెడ్డి, మంత్రి ప్రగడ సత్యనారాయణ, నాయి నేనీ చంద్రకాంత్ రావు ఇబ్రహీం, విష్ణు వర్ధన్ రెడ్డి, అనిల్, ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం, సురేష్ నాయక్, ప్రవీణ్, లక్ష్మణ్,పింటు ,శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఏఆర్ రామరాజు కుటుంబ సభ్యులకు సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర, హైదరాబాద్ : సీపీఐ సీనియర్ నాయకులు ఏఆర్ రామరాజు చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చెన్నకేశవరావు, వందన, వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు.

కేంద్ర పాలకుల విధానాలకు వ్యతిరేకంగా 26న ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం పశ్యపద్మ అధ్యక్షతన హైదరాబాద్ రాజ్ బహదూర్ గౌడ్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి టీ సాగర్, మండలి వెంకన్న, ఎం బిక్షపతి, వి ఉపేందర్ రెడ్డి, జక్కుల వెంకటయ్య, బి రాము, ఈ విజయ్ పాల్గొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక వ్యతిరేక కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ నవంబర్ 26న జిల్లా కేంద్రాలలో కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కార్పొరేట్ కంపెనీల దోపిడీకి వ్యతిరేకంగా, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని, పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని నాలుగు లేబర్ కోడ్లలకు వ్యతిరేకంగా బ్లాక్ దేని పాటించడం, విద్యుత్ సవరణ బిల్లు 2025 ను ఉపసవరించాలని,రుణమాఫీ చట్టం చేయాలని, తదితర డిమాండ్లపై పోరాటాలను ఉధృతం చేసి నా,సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం లాంటి అనేక కార్యక్రమాలను సంవత్సరాలుగా నిర్వహిస్తున్నా ,కేంద్ర పాలకులు స్పందించక పోగా కార్పొరేట్ అనుకూల విధానాలను బరితెగించి అమలు చేయటానికి పూనుకుంటున్నారు. కేంద్ర పాలకుల విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26 జిల్లా కేంద్రాలలో జరుగు కార్యక్రమాలను జయప్రదం చేయటానికి అధిక సంఖ్యలో రైతులను కార్మికులను ప్రజలను సమీకరించాల్సిందిగా సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తుంది. పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలని ,విద్యుత్ సవరణ బిల్లు 2025 ను ఉప సాధించాలని ,ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలని రోజుకు 700 వేతనం ఇవ్వాలని, అకాల ఏకదాటి వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఆహార పంటలకు ఎకరాకు 25000 ఉ ద్యాన వాణిజ్య పంటలకు ఎకరాకు 50,000 రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పంటలకు బోనస్ ఇవ్వాలని, లేబర్ కోడ్లను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేయటానికి ముమ్మర ప్రయత్నం చేస్తున్న కేంద్ర పాలకుల విధానాలను వ్యతిరేకిస్తూ నవంబర్ 26వ తారీకున జిల్లా కేంద్రాలలో జరుగు కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతున్నాం. అన్ని జిల్లాల్లో పత్రికా సమావేశాలు ఏర్పాటు చేయాలి. రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసి నవంబర్ 26వ జరిగే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

మూడో రోజు ప్రైవేట్ కాలేజీల బంద్

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణలో మూడో రోజు ప్రైవేట్ కాలేజీల బంద్ కొనసాగింది. ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించాలంటూ విద్యా సంస్థలు సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. నేటితో ఆ సమ్మె మూడో రోజుకు చేరుకుంది. సెమిస్టర్ పరీక్షలను సైతం ఫార్మసీ కాలేజీలు బహిష్కరించాయి. మరోవైపు రీయంబర్స్‌మెంట్ సంస్కరణల కోసం ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. ఆ కమిటీ కాలయాపన చేయవద్దని కాలేజీ యాజమాన్యాలు ఆందోళన చేస్తున్నాయి. 50 శాతం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశాయి. ఇదిలా ఉంటే సోమవారం నుండి కాలేజీలు బంద్‌లో పాల్గొంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2వేలకు పైగా ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు, పీజీ కాలేజీలు, డిగ్రీ కాలేజీలో బంద్‌లో పాల్గొంటున్నాయి. దీంతో ప్రభుత్వం కాలయాపన చేస్తే విద్యార్థులు నష్టపోతారని వెంటనే బకాయిలు చెల్లించాలంటూ విద్యార్థి సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి.

సోనాలికా రికార్డు స్థాయిలో ట్రాక్టర్ల అమ్మకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశపు నంబర్ 1 ట్రాక్టర్ ఎగుమతి బ్రాండ్, సోనాలికా ట్రాక్టర్స్ అక్టోబర్ 2025లో 27,028 ట్రాక్టర్ల ఆల్-టైమ్ హై నెలవారీ అమ్మకాలతో ఐకానిక్ పనితీరును నమోదు చేసింది. ప్రముఖ ట్రాక్టర్ బ్రాండ్లలో 34.8శాతం అత్యధిక వృద్ధి ఈ అద్భుతమైన పనితీరును నడిపిస్తుంది. ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ మాట్లాడుతూ "అక్టోబర్'25 ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గింపు తర్వాత అతిపెద్ద నెలగా నిలుస్తుందన్నారు. మేము 27,028 ట్రాక్టర్ల రికార్డు స్థాయిలో అమ్మకాలతో మా అద్భుతమైన ప్రయాణంలో ఒక అద్భుతమైన కొత్త అధ్యాయాన్ని లిఖించామని పేర్కొన్నారు. ట్రాక్టర్ పరిశ్రమలో అత్యధికంగా 34.8శాతం వృద్ధిని సాధించడం ద్వారా, మేము పరిశ్రమ పనితీరును 2.3%శ% అధిగమించామని చెప్పారు. అలాగే 2.2 శాతం పాయింట్ల అత్యధిక మార్కెట్ వాటా లాభాలను పొందాము. ఇటువంటి మెగా విజయాలు మా నిబద్ధత, సహకారానికి నిదర్శనం మా 'జజ్బా' - కలిసి గెలిచే మా ప్రత్యేక స్ఫూర్తిని నొక్కి చెబుతున్నాయన్నారు.

శ్రీ సాయి రోలర్ ఫ్లోర్ మిల్ అంబాసిడర్‌గా 'సంజయ్ తుమ్మా'

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: మినార్ బ్రాండ్ పేరుతో హైదరాబాద్‌లో అతిపెద్ద ప్రీమియం పిండి వంటల తయారీదారు అయిన శ్రీ సాయి రోలర్ ఫ్లోర్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్, వాహ్-చెఫ్‌గా ప్రసిద్ధి చెందిన సెలబ్రిటీ చెఫ్ సంజయ్ తుమ్మాను తన కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని QUORUM ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ 150లో జరిగిన ఒక గ్రాండ్ ఈవెంట్‌లో నగరంలో అత్యంత ప్రసిద్ధి చెందిన 2 కలినరీ ఎక్స్పర్ట్స్ మధ్య భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంటూ ఈ ప్రకటన చేయబడింది. ఈ భాగస్వామ్యం ఒక ఉమ్మడి దృష్టిని సూచించడంతో పాటు ప్రతి వంటగదికి ప్రామాణికమైన, ప్రీమియం-నాణ్యత గల పిండిని తీసుకురావడం, ఇంటి వంటవారు వారి పాకశాస్త్ర అనుభవాలను మరింత రుచికరం చేయడానికి ప్రేరేపిస్తోంది. ఈ సందర్భంగా శ్రీ సాయి రోలర్ ఫ్లోర్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆదిత్య బన్సాల్ మాట్లాడుతూ.., "మా మినార్ ఆత్మీయ కుటుంబ సమూహంలోకి ది వాహ్ చెఫ్ సంజయ్ తుమ్మాను స్వాగతిస్తున్నందుకు మేము చాలా సంతోషంగా ఉన్నామన్నారు. వంట పట్ల ఆయనకున్న మక్కువ ప్రతి వంటగదిని, ప్రతి స్క్రీన్‌ను వెలిగించే అతని నైపుణ్యంలో సముచితంగా ప్రతిబింబిస్తుందన్నారు. సందర్భంగా చెఫ్ సంజయ్ తుమ్మ మాట్లాడుతూ "ఒక చెఫ్‌గా, నాణ్యమైన ఆహార పదార్థాల ప్రాముఖ్యతను నేను అర్థం చేసుకున్నాను. అత్యుత్తమ పిండిని తయారు చేయడంలో శ్రీ సాయి రోలర్ ఫ్లోర్ మిల్ యొక్క నిబద్ధత నిజంగా నాతో ప్రతిధ్వనిస్తుందన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార జోరు

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ తమ అదృష్టాన్ని పరీక్షిస్తున్నాయి ఈ సందర్భంగా నువ్వా నేనా అన్నట్టు సాగుతున్న ప్రచారంలో తెలంగాణలోని బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన హేమహేమీగా ప్రచారం చేస్తూనారు. మంత్రులు, మాజీ మంత్రులు, నాయకులు, ఇన్చార్జులు, కార్యకర్తలు ప్రతి వీధి, ప్రతి కాలనీ, ప్రతి డివిజన్లో కలియ తిరుగుతూ తమ అభ్యర్థికి ఓటేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ వెంకటగిరిలోని ప్రతి గడపకి వెళ్లి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ, ఈ ఉపఎన్నికల్లో తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. తను ఎల్లప్పుడూ నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హర్షద్, ఏరియా ఇంచార్జ్ శుభప్రద పటేల్, క్లస్టర్ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, కార్పొరేటర్ రాజ్ కుమార్, బోథన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ భార్య, పటేల్, సీనియర్ నాయకులు సురేందర్ యాదవ్, ముదిరాజ్ సంతోష్, బస్వరాజు, అఫ్జల్ భాయ్, జవీద్ భాయ్, ఆజాం అలీ, బండి రాజు, లక్ష్మణ్, మాధవి, మొదలైన వారు అధిక మంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు భారీ షాక్

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న వేగవంతమైన అభివృద్ధి పనులు, రాష్ట్రంలో ప్రజా పాలనకు మార్గదర్శకుడైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నాయకత్వం పట్ల ఆకర్షితులైన బోరబండ ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోరబండ సాయిబాబా నగర్‌కు చెందిన ఫీరోజ్, అక్బర్, బసవరాజు, కేశవులు, రావుఫ్ తదితర నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్, కొత్తగా చేరిన నాయకులను పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లో రూ.150 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రాంత రూపురేఖలను మార్చేస్తున్నాయి. ఈ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండేందుకు ఈ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం విశేషం. ఈ కార్యక్రమం లో బోరబండ స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీకి జనసేన మద్దతు శుభపరిణామం: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో జనసేన పార్టీ బీజేపీకి ప్రకటించిన మద్దతు శుభపరిణామం. ఉప ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయం అని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తెలంగాణ జనసేన ఇంచార్జ్ శంకర్ గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పాల్గొన్నారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, జనసేన మద్దతు బీజేపీకి సరికొత్త బలాన్నిస్తుంది, ఆంధ్రప్రదేశ్‌లో జనసేన-బీజేపీ-టీడీపీ కూటమి సాధించిన విజయంలా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ మద్దతుతో బీజేపీ విజయపథంలో ముందుకు సాగుతుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమైంది, మా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించడం బీజేపీ జనసేన కూటమి పార్టీ ల సంకల్పం జనసేన-బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో తప్పక విజయాన్ని సాధిస్తాం. ప్రజలు కమలం గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి మార్గంలో భాగస్వాములు కావాలి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వల్ల దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కాంగ్రెస్ పాలనలో అవినీతి, అక్రమాలు, కుంభకోణాలు మాత్రమే జరిగాయి, బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం తప్ప మిగతా వర్గాలు నిరాశలో ఉన్నారు. ఇప్పుడు బీజేపీ-జనసేన భాగస్వామ్యంతో తెలంగాణలో మార్పు అనివార్యం, భవిష్యత్తు బీజేపీదే, రాబోయే ప్రభుత్వం బీజేపీదే జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి మద్దతు ప్రకటించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్‌షోలో షాద్ నగర్ ఎమ్మెల్యే

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన రోడ్ షోతో బీఆర్ఎస్, బీజేపీలో ఖేల్ ఖతం అంటున్నారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన రోడ్‌షోకు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. రూట్ మ్యాప్‌లో బైక్‌పై తిరుగుతూ జనాలలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రేవంత్ రెడ్డిరాకతో జూబ్లీహిల్స్‌లో సీన్ పూర్తిగా మారిపోతుందని, బీఆర్ఎస్, బిజెపిలకు చుక్కలు కనిపించడం ఖాయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రచారంలో ప్రజల నుంచి భారీ స్పందన వస్తుందని, కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు పూర్తిగా ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగే సామర్థ్యం ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

పార్కుల తనిఖీ

విశాలాంధ్ర, మేడిపల్లి:పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని 29 పార్కుల్లో దెబ్బతిన్న జిమ్ పరికరాల మరమ్మతుల కోసం నిధులు విడుదలకు ప్రత్యేక చొరవ తీసుకున్న మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ పార్కుల్లో తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయం 18వ డివిజన్, 26వ డివిజన్ పార్క్‌లో మాజీ కార్పొరేటర్ శ్రీమతి పప్పుల రాజేశ్వరి అంజి రెడ్డి, కుర్ర షాలిని శ్రీకాంత్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ...పీర్జాదిగూడ ప్రజల ఆరోగ్యం కోసం, దెబ్బతిన్న జిమ్ పరికరాలను వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నాం. త్వరలోనే అన్ని పార్కులు ఆధునిక ఫిట్‌నెస్ సదుపాయాలతో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అందరూ వీటిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలపించండి : సీపీఐ

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీ హిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌నీ గెలిపించాలని కోరుతూ సిపిఐ ప్రచారం చేయడం జరిగింది. మోతీ నగర్ చౌరస్తా నుండి బంజారా నగర్, ఎన్ ఆర్ ఆర్ పురం, శ్రీ సాయిబాబానగర్, జ్యోతినగర్ ఏరియాలో షాప్ టు షాప్ తో పాటు ఇంటింటికి సీపీఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని పంచుతూ ప్రచారం జరిగింది. గత పది సంవత్సరాలు అధికారంలోవున్న బీఆర్ఎస్ తెలంగాణను దోచుకొని దాచుకోవడం జరిగింది .2023 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని తిరస్కరించి కాంగ్రెస్ పార్టీని గెలిపించడం జరిగింది. అప్పటినుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అనేక కుట్రలు ప్రారంభించింది. అందులో భాగంగానే బిజెపితోనే అంతర్గతంగా ఒప్పందం కుదుర్చుకొని తిరిగి ఎన్నికల్లో గెలవాలని చూస్తూ ప్రజలను అబద్దాలతో మోసగిస్తున్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్ధంగా లేకుండా ఎప్పుడు అధికారం దక్కించుకొని మళ్లీ దోపిడీ చేయాలని ఉవ్విళ్లు ఊరుతున్నారు. ఇలాంటి పార్టీ నీ ప్రజలు ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి గుణపాఠం చెప్పాల్సిన అవసరం వచ్చిందనీ అన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ యువత మత్తు కి బానిసై తమ విలువైన జీవితాలను ధ్వంసం చేసుకుంటున్న పరిస్థితి అత్యంత విషాదం. కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను నిర్మూలించడం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నది. మీ పిల్లల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని సిపిఐ ఓటర్లను విజ్ఞప్తి చేయటం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్ బోస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, పాలబిందెల శ్రీనివాస్, వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు చైతన్య ,నరసింహ అనిల్, లెనిన్,దస్తగిరి, సుశాంత్,భాను,అరుణ్,సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం : ఎర్ర

విశాలాంధ్ర, బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం జుబ్లీహిల్స్ ఉప ఎన్నిక అయిన తక్షణమే కోర్టు తీర్పులను సాకుగా చూపించి 42 శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతుందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హై కోర్ట్, గవర్నర్, రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లోవున్న 42 శాతం బిల్లుల నేపథ్యాన్ని గుర్తు చేయలేదన్నారు. బీసీ రిజర్వేషన్ల పై గత కొన్ని నెలల నుండి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒక అవగాహనతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ద్వారానే సాధ్యమయ్యే ఈ అంశాన్ని దానిపై గురిపెట్టకుండా, కేంద్ర అప్రకటిత అనుబంధ ఉద్యమ సంస్థ తీసుకువచ్చిన జీవోల ద్వారా పెంపు అనే అంశం ప్రధానంగా ఫోకస్ చేయించి, కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యతను తప్పించిందని ఆయన ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగా కల్పించకుండా, పాత పద్ధతిలో బీసీ రిజర్వేషన్ల కుదింపుతో ఎన్నికలకు వెళ్లే ప్రత్యక్ష దోషిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి రేవంత్ రెడ్డి హటావో నినాదంతో ఉద్యమ శ్రీకారం చుడుతామని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ గతే పడుతుందని ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. ఈనెల 9న గద్వాల్, 22న నిజామాబాద్ 30న మహబూబ్ నగర్, 27న సూర్యాపేటలో బీసీ గర్జన “మహాసభలు”ఏర్పాటు చేస్తున్నామని ఎర్ర సత్యనారాయణ వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి అప్రకటిత అనుబంధ సంస్థల కుట్రల నుండి బయటపడటానికి ఉద్యమశక్తులన్నీ తెలంగాణ ఉద్యమ తరహాలో కేంద్రీకృత ఉద్యమం నుండి వికేంద్రీ కృత ఉద్యమాలవైపు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు నాగుల శ్రీనివాస్ యాదవ్, సతీష్, నాకు నరేష్, కృష్ణ చైతన్య, అరుణ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రూ. 26 లక్షల విలువచేసే గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గంజాయి అక్రమార్కులపై పిడి లాంటి యాక్టులు బనాయించి జైల్లో పంపిస్తున్నప్పటికీ జిల్లా వారధిగా స్మగ్లింగ్ ఆగే ఊసు కనిపించడం లేదు. బుధవారం భద్రాచలంలోని కూనవరం క్రాస్ రోడ్డు వద్ద ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై శ్రీహరిరావు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో అక్రమంగా తరలిస్తున్న రూ 26 లక్షల విలువచేసే 51.9 కేజీల గంజాయి పట్టుబడింది. ముగ్గురిపై కేసు నమోదు కాగా ఇద్దరిని అరెస్ట్ చేసి ఒక కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెప్పారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించి ఈ గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ గణేష్ తెలిపారు. ఒరిస్సా నుంచి గంజాయి కేరళ రాష్ట్రానికి కారులో అక్రమంగా తరలిస్తున్నట్లు చెప్పారు. అనుమానం రాకుండా స్మగ్లర్లుకారు ఇంజన్ లో ప్యాకింగ్ చేసి పెట్టినట్లు తెలిపారు. ఈ కేసులో కేరళకు చెందిన

జకారియా పర్యాల్, నసిర పూర్తియా వేట్టల్ లను అరెస్ట్ చేశారన్నారు. సూర్యాపేటకు చెందిన మరో నిందితుడు ఫెరారీ లో ఉన్నట్లు చెప్పారు. ఇద్దరు వ్యక్తులను గంజాయిని కార్లను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ సిఐ కి అప్పగించారు.

‘ధర్మ’ సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం : గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకోసం సిపిఎం నేత గుగులోత్ ధర్మ నిర్వహించిన ఉద్యమాలు నేటితరానికి ఆదర్శమని, ఆయనలేని లోటు తీర్చలేనిదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, గిరిజన నేత గుగులోత్ ధర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా సుజాతనగర్ మండలంలోని మంగపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధర్మ విగ్రహావిష్కరణ, సంతాపసభలో కూనంనేని తోపాటు సీపీఐ జిల్లా

కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా పాల్గొన్నారు. కూనంనేని మాట్లాడుతూ గుగులోత్ ధర్మ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాలకు దిక్సూచిలాంటి పాత్ర నిర్వహించారని సేవలను కొనియాడారు. సామాన్య గిరిజన కుటుంబంలో జన్మించిన ధర్మ ఎన్నో ప్రజా, రైతు, గిరిజనోద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ప్రజలకు ఒక్కతాటిపైకి తెచ్చి ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారా సమస్యల పరిష్కారంకోసం నిరంతరం శ్రమించాడని తెలిపారు. అనంతరం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మండల నాయకులు భూక్యా దస్రు, కుమారి హన్మంతరావు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్ల ఉత్సావాలకు శ్రమజీవుల విరాళం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : శ్రామికులకు నిరంతరం అండగా ఉండే ఎర్రజెండాను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంతల ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభ, ఉత్సావాల జయప్రదానికి అన్నివర్గాల నుంచి సంపూర్ణ సహకారం అందుతోందన్నారు. ఉత్సావాల జయప్రదానికి తాము సైతం అంటూ పట్టణంలోని పెద్ద బజార్ హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ శ్రమ సంపాదన నుంచి కూడబెట్టిన రూ.100116లను బుధవారం కార్మిక అడ్డాలో సాబీర్ పాషాకు అందించారు. సాబీర్ పాషా మాట్లాడుతూ కార్మికులు, శ్రామికులు, కర్షకులు, పేదవర్గాల అండ ఎర్ర జెండామాత్రమే అన్నారు. వందేళ్లుగా ఎర్ర జెండాను మోస్తూ తమ సమస్యల పరిస్కారం కోసం ఎన్నో త్యాగాలతో అలుపెరగని పోరాటాలు చేస్తున్నారన్నారు. పిలుపునిచ్చారు. ఖమ్మంలో 5 లక్షల మందితో జరిగే బహిరంగ సభకు తరలిరావాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెడ్డాడు నగేష్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణాచారి, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, నీలం మొగిలి, వెలిశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర -కారేపల్లి : కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరుతూ సిపిఐ నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఖమ్మంకి లక్షలాదిగా తరలిరావాలని సీపీఐ జిల్లా నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి సీపీఐ వందేళ్ల వేడుక కార్యక్రమానికి విశేష స్పందన,ఆదరణ వస్తుందన్నారు. ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాలను భావితరాలకు అర్థమయ్యేలా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సీనియర్ నాయకులు వద్దే వెంకటేశ్వర్లు,షేక్ రంజాన్, ఘన్యా, భట్టు మోహన్, బొమ్మల కృష్ణ,బానోతు హత్తిరామ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సారూ.. వైరా మున్సిపాలిటీ వైపు చూడరూ..!

ప్రభుత్వ మరుగుదొడ్లలో ప్రైవేటు వ్యాపారాలు

విశాలాంధ్ర , వైరా : వైరా మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వం ప్రజల అవసరాల నిమిత్తం కొన్ని లక్షల వ్యయంతో మరుగుదొడ్లను నిర్మాణం చేపట్టింది. అయితే గతంలో కొంతమంది టెండర్ ద్వారా ఆ మరుగుదొడ్లను దక్కించుకున్నారు. వ్యాపారాలు బాగా గడించారు. తరువాత టెండర్ల గడువు తీరాక మరల టెండర్లు పిలవలేదు. దీంతో ఆ మరుగుదొడ్లలో విచిత్రంగా ప్రైవేటు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రజలు, ప్రధానంగా మహిళలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఏర్పాట్లు చేయాలనుకున్న ప్రభుత్వ ఉద్దేశం పక్కదారి పట్టింది. దీంతో వేల రూపాయల అద్దెలు వారే తీసుకుంటూ కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం యొక్క ఉద్దేశం నెరవేరలేదు. ఫలితంగా ప్రజలు మరుగుదొడ్డి

సౌకర్యాన్ని ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లలో బహిరంగంగా వ్యాపారాలు నిర్వహిస్తుంటే పట్టించుకునే నాథుడే లేడు. మరుగుదొడ్ల టెండర్లు కాలపరిమితి పూర్తి అయినప్పటికీ తిరిగి టెండర్లు నిర్వహించలేదు. ఫలితంగా అదే మరుగుదొడ్లలో వ్యాపారాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై విశాలాంధ్ర ప్రత్యేక కథనం ప్రచురించినప్పటికీ ,అధికారులు స్పందించలేదు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - తుర్కయంజల్ : బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో వాల్ పోస్టర్‌లను రిలీజ్ చేయడం జరిగింది. అనంతరం బహుజన్ సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కమిటీ అధ్యక్షులు వంగాల కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన సమీక్ష సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేషానికి ముఖ్య అతిథిగా పల్లాటి రాములు, అతిథులుగా జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్, మహిళా ఇంచార్జ్ కంబాలపల్లి శాంతలు హాజరై మాట్లాడారు. ఇబ్రహీంపట్నం నుంచి నాగన్‌పల్లే వెళ్లే మార్గంలో ఉన్న రోడ్లను అదేవిధంగా మూలమలుపు దగ్గర ఉన్న భయంకరమైన చెరువును సందర్శించి వెంటనే రోడ్లను అదేవిధంగా చెరువుకి అడ్డంగా ఏదైనా ప్రమాదం జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ తరఫున డిమాండ్ చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శిగా ధార సిరి (లావణ్య), తుర్క యంజాల్ మున్సిపాలిటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఏర్పుల రవి కుమార్, మునుగనూరు వార్డు అధ్యక్షులుగా అల్వాల జాన్ కుమార్, ఇంజాపూర్ వార్డు అధ్యక్షులుగా మీసాల రవి కుమార్‌లను నియమించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఉపాధ్యక్షులు గుండె శ్రీనివాస్, కోశాధికారి బంగారీగల్ల మహేందర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు మంద రాజు, ఉపాధ్యక్షులు చెరుకూరి కరుణాకర్, తుర్క యంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ, కమిటీ సభ్యులు, చిత్రం కృష్ణ, గోరటి కుమార్, మేడిపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

విశాలాంధ్ర - తుర్కయంజల్ : మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ టెంపుల్, వేంకటేశ్వరస్వామి ఆలయం తో పాటు అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు తెల్లవారుజామునుంచే కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయాలు కార్తీక మాస శోభను సంతరించుకోగా భక్తుల ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆయా ఆలయాల అర్చకులు ప్రాతకాలమందే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, దీపాలంకరణ చేశారు. భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న అనంతరం ఆలయం ముందు కార్తీకమాస దీపాలను వెలిగించి పరవశించారు. భక్తులకు ఎలాంటి అసౌఖర్యాలు కలుగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

డివిజన్ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : నెమలి

విశాలాంధ్ర , కాప్రా : కాంగ్రెస్ హాయంలోనే అభివృద్ధి జరిగిందని మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక వసతులను కల్పించిందని గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ ఓల్డ్ ఎస్వి.నగర్ కాలనీలో సిఎం నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి, ఉప్పల్ కాంగ్రెస్ ఇంఛార్జి మందుముల పరమేశ్వరరెడ్డి సహకారంతో, గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనీల్ కుమార్ చొరవ తీసుకొని సీఎం నిధులతో పనులు ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు నెమలి అనీల్ కుమార్ పరిశీలించారు. కొద్ది సంవత్సరాలుగా దారి నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీ వాసులు విన్నపం మేరకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మల్లాపూర్ డివిజన్‌లోని అనేక సమస్యలను పరిష్కరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ప్రతి బస్తీలో తిరిగి సమస్యలను అడిగి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలోని సమస్యలను డివిజన్లో కాంగ్రెస్ నాయకుల కాంగ్రెస్ నాయకుల తెలుసుకొని సంబంధిత అధికారులతో పరిష్కరిస్తున్నారని అనిల్ కుమార్ చెప్పారు.

విజయవంతంగా ముగిసిన దీపావళి మిలన్

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : అగర్వాల్ సమాజ్ హిమాయత్‌నగర్ శాఖకు చెందిన దీపావళి మిలన్ అన్నకూట్ ముగిసింది. అగర్వాల్ సమాజ్ విభయత్ నగర్ శాఖ జియ్యముడలోని రంగనాథ స్వామి ఆలయంలో దీపావళి మిలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. మొదటి సెషన్‌లో, రశ్న ఏకమి భాన్స్ నల్య నిర్వహించారు. ఇందులో సంజయ్ అగర్వాల్, మనీష్ అద్వాల్, దిలీప్ అవార్, దియక్ కుసార్ గుణ ఆదిత్య అవత్ చాలా అందమైన హమ్ మన్నవర్‌తో భగవంతుని వివాహ వేడుకను నిర్వహించారు. సుమారు 10 కుటుంబాలు ఇందులో పాల్గొని ఆశీస్సులు పొందాయి. కార్యక్రమం రెండవ సెషన్‌లో దీపావళి మిలన్ కింద, అందరూ ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఆవాల్ సమాజ్ బంగ్లా అధ్యక్షుడు అరిథ్ గుణ ఉపాధ్యాయ సత్తిని శాఖ కార్యాలయ అధికారులు శాంతి పదాను అందించి సత్కరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సంజయ్ అగర్వాల్, దివాల్ ప్రత్యేకంగా సహకరించారు.అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు అనిరుధ్ అగర్వాల్ జియముడలో ఉన్న రంగనాథ్ సమాజ్ అధ్యక్షుడు, సహ మంత్రి మనీష్ అగర్వాల్, ప్రరివాల్, కేంద్ర కమిటీ సభ్యుడు బవారియా మంత్రి దినేష్ అష్మల్, ఉపాధ్యక్షుడు ఆనంద్ పిట్టి, అధ్యక్షుడు అధ్యక్షవాల్, అనిల్ అధ్యక్షుడు సంజయ్ అగర్వాల్, డి.పి. అద్వాల్ కార్మికులు సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. అగర్వాల్ సమాజ్ పుపా ఉపాధ్యక్షుడు రూపేష్ అపర్వాల్, కోశాధికారి వికాస్ అగర్వాల్, సెంట్రల్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంజయ్ అగర్వత్, మంత్రి దినేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు ఆనంద్ పిట్టి, మంత్రి మనీష్ బాట్, కోశాధికారి వికాస్ అగర్వాల్, కేంద్ర కార్యనిర్వాహక సభ్యుడు రామ బజారియా, నాన్-కోఆర్డినేటర్ డి.పి. అసల్, హిమాయత్‌నగర్ బ్రాంచ్ నుండి కోశాధికారి అచల్ గుప్తా పాల్గొన్నారు.

రేపు నిసార్ పని ప్రారంభం: ఇస్రో

బెంగళూరు: ఇస్రో మరో కీలక కార్యక్రమాన్ని ప్రకటించింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాతో కలిసి అభివృద్ధి చేసిన నిసార్ ఉపగ్రహం శుక్రవారం నుంచి పని ప్రారంభిస్తున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చైర్మన్ నారాయణన్ వెల్లడించారు. నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రేడార్ (నిసార్) అత్యంత ఖరీదైన భూ పరిశీలన ఉపగ్రహం. భూమిపై మంచు కేంద్రాలను ప్రతి 12 రోజులకు రెండు సార్లు పర్యవేక్షించే సామర్థ్యం దీని సొంతం. మొత్తం 2,400 కేజీల నిసార్ ఉపగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా జులై 30న ఇస్రో ప్రయోగించింది. డేటా సమీకరణ పూర్తి కావడంతో ఈనెల 7న నిసార్ శాటిలైట్ ఆపరేషనల్ కాబోతోందని ప్రకటించనున్నట్లు నారాయణన్ వెల్లడించారు. ఆయన బుధవారం ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఈఎస్‌టీఐసీ)లో ఈ వివరాలు తెలిపారు. రెండు సార్ వ్యవస్థలు... ఎల్ బ్యాండ్-ఎస్ బ్యాండ్ సెన్సార్లను మోసుకెళ్లిన తొలి మిషన్ నిసార్ అని అన్నారు. ఎల్ బ్యాండ్ రేడార్ అడవి నేలల్లో తేమను గుర్తించగలదు. జీవరాశులు, భూమి-మంచు ఉపరితలాల కదలికలను కొలవగలదు. ఎస్ బ్యాండ్ రేడార్ కొన్ని రకాల వ్యవసాయం, గడ్డి భూముల పర్యావరణ వ్యవస్థలు, మంచులోని తేమను గమనించగలదు. ఈ రెండు వ్యవస్థలు మేఘాలు, హిమపాతం ఆధారంగా డేటాను సేకరించగలవు. నిసార్ అందించే డేటా అసాధారణమైందని, ఈ ఉపగ్రహంతో చాలా ఉపయోగాలు ఉన్నాయని నారాయణన్ తెలిపారు. అలాగే, గగన్‌యాన్ మిషన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, వచ్చే ఏడాది జనవరిలో దీనిని ప్రయోగిస్తామన్నారు. 2027లో దేశీయంగా తయారు చేసిన రాకెట్‌లో వ్యోమగాములను పంపే లక్ష్యంతో ఈ మిషన్ కోసం 8వేలకుపైగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. భూమి చుట్టూ తిరగడం కోసం వ్యోమగాములను పంపడానికి ముందు మూడు మానవరహిత మిషన్లను ఇస్రో చేపడుతుందని నారాయణన్ అన్నారు. 2028 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం మొదటి మాడ్యూల్ ప్రయోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. 2035 నాటికి పై మాడ్యూల్ ఆర్బిటల్ ల్యాబ్ పనులు పూర్తి చేస్తామని నారాయణన్ చెప్పారు.

పరిపాలన సౌలభ్యం కోసమే

కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు

మంత్రి వర్గ ఉపసంఘం పునర్విభజనపై కసరత్తు

విశాలాంధ్ర-సచివాలయం: జిల్లాల పునర్విభజన సమస్యల పరిష్కారంపై మంత్రి వర్గ ఉపసంఘం కసరత్తు చేస్తోంది. బుధవారం రాష్ట్ర సచివాలయంలో కీలక అంశాలపై మూడు గంటలపైగా మంత్రులు చర్చించారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేశాక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని...ఆయా సమస్యలను సత్వరం పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారని తెలిపారు. ప్రాంతాల వారీగా ప్రజలు, ప్రజా ప్రతినిధులు మాకు వినతులు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎలా పరిష్కరించాలనే విషయమై చాలా లోతుగా అధ్యయనం చేశామన్నారు. ప్రతి సమస్య పరిష్కారంపై మంత్రి వర్గ ఉపసంఘం చర్చించిందన్నారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఎక్కడా ఎవరి ఒత్తిళ్లు లేవన్నారు. పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు,రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ చేస్తున్నామన్నారు. 7-8 కొత్త జిల్లాలు కావాలని ప్రజలు వినతి పత్రాలిచ్చారన్నారు. మరీ చిన్న జిల్లాలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదని మంత్రి వర్గం అభిప్రాయపడిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల అమలు చేసే విషయమై చర్చించామన్నారు. మార్కాపురం, మదనపల్లి జిల్లా ఏర్పాటుపై మంత్రి వర్గ ఉపసంఘం సానుకూలంగా ఉందని చెప్పారు. రెవెన్యూ డివిజన్లు కావాలని ఎక్కువ వినతులు వచ్చాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజలు పడే కష్టాలు ఎలా తీర్చాలనే అంశంపై చాలా సేపు చర్చించామన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు 200-300 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఎస్ ఆర్ జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక అథారిటీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలన్న సీఎం ఆదేశాలపై చర్చించినట్లు చెప్పారు. పోలవరం ముంపు మండలాల ను ఎక్కడ కలపాలనే విషయం పైనా చర్చించామన్నారు. మరో సమావేశం ఏర్పాటు చేసుకుని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుపై తుది నివేదిక రూపొందిస్తామన్నారు. సీఎంకు తుది నివేదిక ఇచ్చాక తదుపరి చర్యలుంటాయని మంత్రి అనగాని తెలిపారు. రిజిస్ట్రేషన్ల కార్యాలయాలల్లో ఏసీబీ తనిఖీలపై స్పందిస్తూ రిజిస్ట్రేషన్ల శాఖపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకే ప్రభుత్వం తనిఖీలు చేపట్టిందన్నారు. అధికారుల్లో భయం ఉంటేనే పరిపాలన మెరుగు పడుతుందన్నారు. తప్పు చేసిన వారందరిపై ప్రభుత్వం తప్పక చర్యలు తీసు కుంటుందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి పలువురు అధికారులను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. తప్పు చేసిన వారందరిపైనా ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, సత్యకుమార్ వర్చువల్‌గా హాజరయ్యారు.

జొహ్రాన్ గెలుపు ట్రంప్‌నకు గొడ్డలిపెట్టు: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమెరికాలోని న్యూయార్క్ నగర మేయర్‌గా డెమొక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మందానీ గెలుపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు గొడ్డలిపెట్టు అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికా స్థానిక ఎన్నికల్లో ఫలితాలు అధికార రిపబ్లికన్ పార్టీకి, ముఖ్యంగా ట్రంప్‌నకు షాకిచ్చాయని, ఈ ఎన్నికల్లో అత్యంత కీలకంగా మారిన న్యూయార్క్ నగర మేయర్ పదవిని డెమొక్రటిక్ పార్టీకి చెందిన 34 ఏళ్ల జొహ్రాన్ మమ్దాని కైవసం చేసుకున్నారని తెలిపారు. భారతీయ మూలాలున్న జొహ్రాన్ ఓటమి కోసం ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగడంతో ఈ ఎన్నికకు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. 'కమ్యూనిస్టు భావజాలం గల జొహ్రాన్ మమ్దాని న్యూయార్క్ మేయర్‌గా గెలిస్తే ఈ నగరానికి ఫెడరల్ సాయం అందదని ట్రంప్ సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొనడం ఆయన అహంకారానికి అద్దంపడుతోందని రామకృష్ణ పేర్కొన్నారు. ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ గెలిచి చరిత్ర సృష్టించిన జొహ్రాన్ మమ్దానికి అభినందనలని, ఆయన విజయం ట్రంప్ అనాలోచిత విధానాలకు, పాలనకు గట్టి ఎదురుదెబ్బ అని తెలిపారు. ఈ ఎన్నికల్లో జొహ్రాన్‌ను అడ్డుకునేందుకు రిపబ్లికన్ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించకపోవడం ట్రంప్ ఏకపక్ష, నిరంకుశ విధానాలకు గొడ్డలిపెట్టని అభిప్రాయపడ్డారు.

వీశాట్ పరీక్షల నోటిఫికేషన్

దరఖాస్తులకు ఫిబ్రవరి 25 వరకు గడువు - మార్చి 1 నుంచి ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడం వంటి లక్ష్యాలతో ముందుకెళుతున్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఫార్మ్-డీ ప్రవేశాల కోసం వీశాట్ 2026-27 నోటిఫికేషన్‌ను ఆయన బుధవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు లభిస్తాయన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకు అనుబంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందిస్తున్నదని చెప్పారు. యూనివర్సిటీ డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణకిశోర్ మాట్లాడుతూ వీశాట్ దరఖాస్తులు గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్టణం, ఏలూరు, రాజమండ్రిలోని అన్ని విజ్ఞాన్ సంస్థలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్ https://admissions.vignan. ac.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. దరఖాస్తును ఫిబ్రవరి 25లోగా పూర్తి కావాలన్నారు. తొలి 50లోపు ర్యాంకులకు 50 శాతం, 51-200 లోపు ర్యాంకులకు 25 శాతం స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు కృష్ణకిశోర్ తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ దిరిశాల విజయరాము, డైరక్టర్ అడ్మిషన్స్ గౌరీశంకర్ రావు పాల్గొన్నారు.

మైత్రి సంచిక ఆవిష్కరించిన సీపీఐ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) ఆంధ్ర ప్రదేశ్ సమితి ప్రచురించిన 'మైత్రి' ప్రత్యేక సంచికను బుధవారం విజయవాడలో సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ఆవిష్కరించారు. పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఇస్కఫ్ సీనియర్ నాయకులు మహబూబ్ అజాం, పార్టీ నాయకుడు టి.రామచంద్రయ్య, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాగితాల రాజశేఖర్, ఇస్కఫ్ కృష్ణాజిల్లా నాయకులు పరుచూరి అజయ్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

ఎన్నికల వేళ బీహార్‌లో 'స్టింగ్' కలకలం

ఇది బీజేపీ నేతల నిజరూపం: ఆర్‌జేడీ

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైన తరుణంలో ఓ స్టింగ్ ఆపరేషన్ సంచలనంగా మారింది. హిందీ వార్తా సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. బీహార్ దుష్ట రాజకీయ నేతల నిజ స్వరూపానికి వార్తానివేదిక అద్దంపట్టింది. నాయకుల కోసం అమ్మాయిల సరఫరా గురించి బీజేపీ మహిళా నేత సంభాషణకు సంబంధించిన వీడియోను ఎక్స్ మాధ్యమంగా ఆర్‌జేడీ జాతీయ అధికార ప్రతినిధి కాంచన యాదవ్ పంచుకున్నారు. వార్తా నివేదిక బయట పెట్టినది కనీసం రాయలేకపోతున్నా అంటూ పోస్టు పెట్టారు. 'బీజేపీ నాయకుల ఎత్తులు-జిత్తులు, వారి వ్యక్తిత్వం, నిజ రూపం బహిర్గతమైంది. మహిళలంటే వారికి ఎంత గౌరవమో ఈ వీడియో క్లిప్‌తో స్పష్టమవుతున్నది' అంటూ ఆమె విమర్శలు గుప్పించారు. 'నాయకుల ఇష్టాయిష్టాలు నాకు తెలుసు. వాళ్లకు అందమైన అమ్మాయిలు కావాలి. కొందరికి ఒకరు, మరికొందరికి ఇద్దరు అవసరం. కొన్నిసార్లు ఇద్దరు నాయకులు ఒకే అమ్మాయిని కోరుకుంటారు. ఇంకొందరు డబ్బు చెల్లిస్తారు కానీ శృంగారంలో పాల్గొనరు. అందుకోసమే ఎవరికి ఎలాంటి అమ్మాయి ఇష్టమో గమనంలో ఉంచుకొని సరఫరా చేస్తాం. మీరు అభ్యర్థులను ఏర్పాటు చేయండి. హైప్రొఫైల్ అమ్మాయిలను పంపడం మా బాధ్యత. బీహార్ ఎన్నికల కోసం అధిష్ఠానం పెద్ద బాధ్యతే అప్పగించింది. దీంతో పని సులభమవుతుంది. మాకు అన్ని చోట్ల పలుకుబడి ఉంది. అన్ని పార్టీల్లో మనవాళ్లు ఉన్నారు. నా వైపు నుంచి మీకు పూర్తి హామీ ఉంటుంది. మనల్ని ప్రశ్నించేవారెవరూ ఉండరు. పార్టీ ఎమ్మెల్యేలకూ దీని గురించి తెలుసు. ప్రశ్నించే ధైర్యం ఎవరికి లేదు. నేనేమీ సామాన్య నేతను కాదు. నాకు చాలా మంది బడా నాయకులతో పరిచయం ఉంది' అంటూ ఆ వీడియోలో మహిళా నేత సంభాషణ సాగింది.

ఉన్నత విద్య పాఠ్యప్రణాళిక ప్రక్షాళన

మంత్రి లోకేశ్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉన్నత విద్య పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేయాలని, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పరిపాలనకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్ రూపొందించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఉన్నత విద్య, ఇంటర్మీడియట్ విద్యపై ఉండవల్లి నివాసంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ, కళాశాలల్లో నాలుగేళ్ల పాటు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం లేదని, అమీర్‌పేటలో నాలుగు నెలల కోచింగ్‌తో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఐటీఐలు, విశ్వవిద్యాలయాలను నవంబర్‌లోగా పరిశ్రమలతో అనుసంధానానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రైవేటు కళాశా లలను నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానం చేసి ప్రాంగణ నియామకాలకు హామీ ఇవ్వాలని, కళాశాలల్లో తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ విద్యపై ఉన్నతాధికారులతోనూ మంత్రి సమీక్షించారు. ఇంటర్‌లో చేపట్టిన సంస్కరణలను అధికారులు వివరించారు. అన్ని గ్రూపులకు వారాంతపు పరీక్షలు నిర్వహించడంతో పాటు ట్రాకింగ్ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. వృత్తి విద్య కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులను ట్రాకింగ్ చేయాలని, ప్రైవేటు కళాశాలలకు అనుమతులపై కాలపరిమితి ఉండాలని మంత్రి ఆదేశించారు.

27న సింగపూర్‌కు ఉత్తమ ఉపాధ్యాయులు

అధునాతన విద్యా విధానాలపై అధ్యయనానికి 78 మంది బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలను ఈనెల 27న సింగపూర్ పంపేందుకు ఏర్పాట్లు చేయాలని లోకేశ్ ఆదేశించారు. ఈనెల 27 నుంచి డిసెంబర్ 2 వతేదీ వరకు ఉత్తమ ఉపాధ్యాయులు సింగపూర్‌లోని ప్రముఖ స్కూళ్లను సందర్శించాలన్నారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు, పబ్లిక్ లైబ్రరీల బలోపేతం, పాఠశాలల్లో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో మానవ వనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయ రామరాజు, సమగ్ర శిక్ష రాష్ట్ర సమన్వయకర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీఆర్వోల పదోన్నతులపై వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు బుధవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఒకే కేడర్‌లో 17 ఏళ్లుగా పనిచేసిన వీఆర్వోలకు డిప్యూటీ తహసీల్దార్ పే స్కేల్ ఇవ్వాలని కోరారు. పదేళ్ల అనుభవమున్న వారికి సీనియర్ అసిస్టెంట్ జీతం, ఐదేళ్ల అనుభవం ఉంటే జూనియర్ అసిస్టెంట్ స్థాయి వేతనం ఇవ్వాలని మంత్రిని కోరారు.

జనవరి నుంచి గోదుమ పిండి

మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనవరి నుంచి రేషన్ కార్డు దారులకు ఒక్కో కుటుంబానికి 1 కిలో గోదుమపిండి 18 రూపాయలకే పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఇందుకోసం 2,400 మెట్రిక్ టన్నుల గోదుమపిండి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బుధవారం విజయవాడ సివిల్ సప్లయి భవన్‌లో మంత్రి నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ ఈసారి ఖరీఫ్ మాసానికి 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం 4,041 రైతు సేవా కేంద్రాలు,3803 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 16,700 మంది సిబ్బంది సిద్ధమవుతున్నట్లు తెలిపారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా 6 కోట్ల గోతాలను సిద్ధం చేశామన్నారు. గత ప్రభుత్వం దాదాపు రూ.1,670 కోట్ల బకాయిలు వదిలి వెళ్లిందని, కొన్ని సందర్భాలలో రైతులకు చెల్లించాల్సిన బకాయిలను 6 నెలల నుంచి 9 నెలల వరకు ఇవ్వలేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు 87 శాతం ధాన్యం కొనుగోలు డబ్బులు 48 గంటల్లో రైతు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఈ సారి 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇక నుంచి ప్రతి నెల, ప్రతి వారం ధాన్యం కొనుగోలు పై సమీక్షిస్తామన్నారు. దీపం-2 పథకం 3వ విడతలో ఇప్పటివరకు 90 లక్షల మంది లబ్ధి పొందారని మంత్రి వివరించారు. నవంబరు 30 వరకు 3వ విడత కొనసాగుతుందన్నారు. మొంథా తుఫాను బాధితులకు పౌరసరఫరాల శాఖ 2 లక్షల 39 వేల 169 మంది కుటుంబాలకు నిత్యావసరాలు అందించిందన్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డుల పంపిణీ 92 శాతం పూర్తయిందని తెలిపారు. చాలా జిల్లాల్లో ఈ క్రాప్ పూర్తయిందని, 39 లక్షల 51 వేల ఎకరాలు ధాన్యం కొనుగోలు ఈ క్రాప్ కింద నమోదు అయిందని, నూటికి నూరు శాతం ఈ క్రాప్‌లో నమోదు అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. ముందుగా జరిగిన సమీక్షా సమావేశంలో సివిల్ సప్లయిస్ ఎండీ ఢిల్లీ రావు, డైరెక్టర్ గోవింద్ పాల్గొన్నారు.

'టెట్' పై రివ్యూ పిటిషన్ వేయరేం?

- కూటమి ప్రభుత్వ తాత్సారం
- లక్షమంది ఉపాధ్యాయుల ఎదురుచూపు
- టెట్ ఉత్తీర్ణత తప్పనిసరితో కలవరం
- దూసుకొస్తున్న దరఖాస్తు గడువు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా ఉపాధ్యాయ విద్యార్హత పరీక్ష(టెట్)-2025 రాయాలా? వద్దా? అంటూ ఆందోళన చెందుతున్నారు. కూటమి సర్కారు రివ్యూ పిటిషన్ వేసి మినహాయింపు ఇస్తుందేమోనన్న ఆశతో వేచిస్తున్నారు. ఏపీ టెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 23వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. సర్కారు ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను తప్పనిసరి చేయడంతో వారిలో కలవరం మొదలైంది. 2011కి ముందు డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు...ఇక ముందు సర్వీస్‌లో కొనసాగాలంటే టెట్ ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు సెప్టెంబర్ 1వ తేదీన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. వారంతా రెండేళ్లలోపు టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని గడువు ఇచ్చింది. అదే సమయంలో ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు మాత్రం టెట్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇప్పుడు ఈ నిబంధనలు ఉపాధ్యాయులను కలవరపెడుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 80వేల మంది ఉపాధ్యాయులు విధుల్లో ఉన్నారు. పీఈటీ, పీడీలకు టెట్‌ను మినహాయిస్తే... దాదాపు లక్షన్నర మంది సర్కారు ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. 2010 తర్వాత ఉపాధ్యాయ పోస్టులలో చేరిన వారంతా టెట్ ఉత్తీర్ణత సాధించి చేరిన వారే కావడం విశేషం. 2010 కంటే ముందు కేవలం (టెట్ లేకుండా)డీఎస్సీ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఇందులో ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 2027 ఆగస్టు 31వ తేదీలోపు వారంతా టెట్ ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. రెండేళ్లలో వీరంతా టెట్ ఉత్తీర్ణత సాధించలేకుంటే ఉద్యోగం వదులుకోవాల్సి ఉంటుందని సుప్రీం తీర్పు స్పష్టం చేసిన విషయం విదితమే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చట్టాన్ని పరిగణలోకి తీసుకొని ఇన్‌సర్వీస్‌లో ఉన్న అందరూ టెట్ ఉత్తీర్ణత సాధించాలని చెప్పడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని ఎన్‌సీటీఈ మార్గదర్శకాలలో సవరణ చేసేలా రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఉపాధ్యాయ సంఘాలు రివ్యూ పిటిషన్ వేశాయి. 25ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులు...ఇప్పుడున్న సిలబస్‌కు అనుగుణంగా టెట్ రాసి..అర్హత సాధించడం వారికి భారంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తు ఏమౌతుందో కనీసం పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు టెట్ పరీక్షలకు సన్నద్ధమవుతూ, మరోవైపు విద్యార్థులకు చదువులు చెప్పడం వారికి

భారంగా మారింది. ప్రస్తుతం సర్కారు పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో సతమతమవుతున్నారు. యాప్‌లు కేటాయించి నిరంతరం వివిధ పనుల్ని కేటాయిస్తున్నారు.

సుప్రీంలో కూటమి ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి: ఎస్టీయూ

ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులందరికీ టెట్ మినహాయించాలని, ఆ దిశగా సుప్రీంలో కూటమి ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని ఎస్టీయూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం అమలు అయిన తర్వాత 2010 ఆగస్టు నుంచి ఉపాధ్యాయ నియామకాల కోసం టెట్‌లో ఉత్తీర్ణత అవసరమని, అంతకు మునుపు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నవారికి టెట్ అవసరం లేదని ఎన్‌సీటీఈ ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. టెట్ అర్హత లేకుండా పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో ఐదు సంవత్సరాలకుగాపైగా సర్వీస్ ఉన్నవారంతా రెండేళ్లలోపు లోపు టెట్ అర్హత సాధించాలని, లేకుంటే సర్వీస్ నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎన్‌సీటీఈ 2010లో ఉత్తర్వులు ఇవ్వక మునుపు నియమించిన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదనీ, ఇన్ సర్వీస్‌లో ఎప్పటికప్పుడూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున 2010కి ముందు ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదనీ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. సర్వీస్‌లో చేరిన తర్వాత ఏ విభాంలోలేని అర్హత పరీక్ష ఉపాధ్యాయులకు అమలు చేయాలనుకోవడం సరికాదన్నారు. ఎస్టీయూ పక్షాన ఇప్పటికే సుప్రీంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేశామని గుర్తుచేశారు.

కృష్ణా నదిపై హై లెవల్ వంతెనతో

దీవుల్లోని గ్రామాల అనుసంధానం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా నదిపై హైలెవల్ వంతెన నిర్మాణం ద్వారా ఎదురుమొండి దీవులవాసుల చిరకాల కలను సాకారం చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సాస్కీ పథకం ద్వారా తగిన నిధులు సమకూరుస్తామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పునరుద్ధరణకు కేంద్ర సహకారంతో చర్యలు ప్రారంభిస్తున్నామని చెప్పారు. మంగళగిరిలో ఆయన అధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ బాలాజీతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొంథా తుపానుతో నష్టపోయిన పంటల అంచనాలు, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి సహాయం అందించాలని అధికారులను పవన్ ఆదేశించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కాలువల అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు పని చేయకపోవడంతో తీరప్రాంతంలో ఐదు వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.50 కోట్లు కేటాయించి, ఏడు స్లూయిజ్‌ల పునర్నిర్మాణం చేపడతామన్నారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి మాట్లాడతానని పవన్ చెప్పారు. హంసలదీవి ప్రాంతానికి భక్తుల ప్రవేశానికి అటవీ శాఖ రుసుమునకు ప్రత్యామ్నాయం అవసరమన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, నీటిపారుదల చీఫ్ ఇంజనీర్, జిల్లా అటవీ అధికారులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.